హనీబీఎపి

జులై - సెప్టెంబర్ 2008

# పల్లెసృజన


సంపుటి 3, సంచిక 1

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



పేదలను
100 రోజులు
కేవలం కూలి పనులలో మాత్రమే
ఎందుకు ఉపయోగించాలి?



విద్యార్థులు తరాల మధ్య వంతెన.... సరియైన మార్గదర్శకత్వంతో సాంప్రదాయ జ్ఞానం నిక్షిప్తమౌతుంది

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

- 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.
- నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చుడమైనది.
- నలుగురు ఇన్నోవేటర్లను అహమ్మదాబాద్ లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం జరిగింది. వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- వందలాది తెలుగు ప్రజలతో టెలిఫోన్ ద్వారా హనీబీ గురించి చర్చించడం, వారికి తెలియజేయడం.
- గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణ లను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 5వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి వందకు పైగా ఎంట్రీలు పంప బడ్డాయి.
- పారిశ్రామికవేత్తలు, అనధికార సంస్థలు, హనీబీ మూల పురుషుడు శ్రీ అనిల్ గుప్తా గారి సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్లు ఆవిష్కరణలను ప్రదర్శించారు.
- ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.
- ఇప్పటి వరకు 8 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.
- టి.ఇ.పి.పి. ఛైర్మన్, డా. ఎ.ఎస్. రావు గారితో 16 మంది ఇన్నోవేటర్లతో ముఖాముఖి ఏర్పాటు చేయడం జరిగింది.
- తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.
- హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.
- జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.
- ఫిబ్రవరి 2008లో మహబూబ్ నగర్ జిల్లా ఉత్తనూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలో సంప్రదాయ జ్ఞానం, తమ అన్వేషణలను ఇన్నోవేటర్లు రైతులతో పంచుకున్నారు.
- మ్యాట్రిక్స్ సంస్థలో ఇద్దరు ఆవిష్కర్తల హెర్బల్ మందులను మార్కెట్ చేయటానికి ఒప్పందం కుదిరింది.
- ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.
- ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో 'యస్.సి.ఎ.ఐ.' క్లబ్‌ను ప్రారంభించి, ఇన్నోవేటర్లకు ఉచితంగా సలహాలు, సహకారాలను అందించడం జరుగు తోంది.
- సెప్టెంబర్ 2008లో అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఇద్దరు హనీబీఏపి కార్యకర్తలు 'స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్ వర్క్‌షాప్'లో పాల్గొనడం జరిగింది.
- అలేరు నివాసి, ఉత్తమ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ ఇన్నోవేషన్ సమావేశానికి ఆహ్వానించబడ్డారు.
- నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.

**మా కలలు :**

- ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.
- పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-3 సంచిక - 1 జులై - సెప్టెంబర్ 2008



## సంపాదకవర్గం

ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
డా. కె.ఎల్. రావు
డా. వై.వి. రావ్
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
శ్రీమతి అరుణ గణేశం
పల్లె వీరరాఘవ రెడ్డి



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన -శ్రీమతి పి. అరుణ
102, వాయుపురి, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com
visit us at : www.nifindia.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040- 40179462, 30627739
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com


## ఈ సంచికలో...


- తాతగారి జ్ఞానం - మనవరాలి సేకరణ - 3
- హామీ పథకం శ్రమతో పాటు జ్ఞానపరంగా ఉంటే ! - 5
- సునీత సేకరించిన సాంప్రదాయ జ్ఞానం - 8
- ఆలేరు నుండి అబ్దుల్ కలాందాకా - 11
- ఇంధనం అవసరం లేని మోటార్ సైకిల్ - 13
- వెంగళదాసు నరేష్ 'కేశఖని' - 16
- 'హనీబీఎపి' కార్యక్రమాలు అద్భుతం - 17
- నేను శోధించిన శోధయాత్ర - 18
- ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 25
- గ్రామీణ ఇన్నోవేటర్ల-ఇంజనీరింగ్ విద్యార్థుల సదవగాహన - 26
- స్పందన - 27


**కవర్ లోపలి పేజీల్లో :**


హనీబీఎపి ప్రగతి
వంటగ్యాస్‌తో ప్రమాదాల నివారణకు షేక్ ఇష్వాఖ్ టెక్నిక్



### HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
**Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org, http://www.sristi.org

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1553.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "HoneyBeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం

విద్యార్థులను పల్లెజ్ఞానశోధలో చేర్చుకోవాలన్న ఉద్దేశ్యంతో హనీబీఏపి ఆయా కళాశాలల్లో ఇన్నోవేషన్ క్లబ్‌లను ప్రారంభించడానికి పూనుకుంది. అక్టోబర్ 15, 2008 నాడు పద్మశ్రీ అనిల్ గుప్తా గారు ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో క్లబ్బును ఆవిష్కరించారు. ఆనాటి వివరాలు ఈ సంచిక మధ్యపేజీల్లో ప్రచురించాము.

విద్యార్థులు తరాల మధ్య వంతెన వంటివారు. వీరికి సమాజం సరియైన మార్గదర్శకత్వం చేస్తే అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. తల్లిదండ్రులు, గురువులు, సమాజ పెద్దలు మా ఈ ప్రయత్నంలో యువతరాన్ని ప్రోత్సహించి, పెద్దయెత్తున జ్ఞానసముపార్జనలో పాల్గొనేలా చేస్తారని ఆశిస్తున్నాం.

ఆసు మిషన్ సృష్టికర్త చింతకింది మల్లేశం గురించి పాఠకులకు విదితమే. అహమ్మదాబాద్ ఎన్.ఐ.ఎఫ్. ఆధ్వర్యంలో జరిగిన ఇన్నోవేటర్ల సమావేశానికి మల్లేశానికి ఆహ్వానం అందింది. అక్కడ గుజరాత్‌లోని చేనేత కార్మికులతో కలసి తమ తమ అనుభవాలను చర్చించుకునే అవకాశం కల్గింది. మన మల్లేశం భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న శ్రీ అబ్దుల్ కలాం గారిని కలిసి తన సృజన 'ఆసుమిషన్' గురించి చర్చించడం జరిగింది. అహమ్మదాబాద్ అనుభవాలను గురించి "మల్లేశం మాట" ఈ సంచికలో ప్రచురించాం.

హనీబీ నెట్‌వర్క్ గత ఇరవై ఏళ్ళుగా, ఎన్.ఐ.ఎఫ్. గత ఎనిమిదేళ్ళుగా, హనీబీఏపి గత మూడేళ్ళుగా పల్లెజ్ఞాన సంపదను శోధించి వెలుగులోకి తెచ్చి సమాజానికి ఉపయోగపడేలా చేయాలన్న ప్రయత్నం కొనసాగుతున్నా, ఈ సంస్థల గురించి సరియైన ప్రచారం కొరవడి మెజారిటీ తెలుగు జనాభాకు వీటి కార్యక్రమాలపై అవగాహన కొరవడింది. పల్లె పల్లెలో వున్న ఇన్నోవేటర్లను, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలికి తీయడం భగీరథ ప్రయత్నం. దీన్ని కొన్ని సంస్థలు సీరియస్‌గా చేపట్టినా, అన్ని ఊళ్ళకూ చేరడం అసంభవం. సమాజంలోని ప్రతి అంగమూ దీనికి చేయూతనివ్వాలి. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు. పది లక్షల మంది విద్యార్థులు సెలవుల్లో గ్రామాలకు వెళ్ళినపుడు చుట్టూ వున్న జ్ఞానాన్ని పరికించి, వాటి వివరాలను హనీబీఏపి సంస్థకు జ్ఞానకర్త వివరాలతో సంవత్సరానికి పది చొప్పున పంపితే, ఒకే సంవత్సరంలో ఒక కోటి జ్ఞాన కోశం తయారవుతుంది. ఈ కోశాన్ని ఉచితంగా (ఓపెన్ సోర్స్) సమాజంలోని అన్ని వర్గాలకు లభించేట్టుగా చేయాలి. అప్పుడు ఎంటర్‌ప్రినర్స్ వీటిని వస్తువులుగా మార్చి మార్కెట్‌లోకి తీసుకు రావడానికి గొప్ప అవకాశం వుంటుంది. రీసెర్చ్ చేయడానికి పలు విషయాలు ఈ జ్ఞానకోశం నుండి లభిస్తాయి. మన పల్లెజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగకరంగా చేయడానికి జ్ఞాన స్వంతదారులకు ఆర్థిక లాభం కలుగడానికి ఈ జ్ఞానకోశం దోహదపడుతుందని హనీబీఏపి గాఢంగా విశ్వసిస్తున్నది.

\- సంపాదకవర్గం

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక జ్ఞానవేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం. -సంపాదకవర్గం

# తాతగారి జ్ఞానం - మనవరాలి సేకరణ



శ్రీ లాలిరెడ్డి గారు
సంధ్యారాణికి స్ఫూర్తినిచ్చిన
వారి తాతగారు



కుమారి వాసిరెడ్డి సంధ్యారాణి
మహిళా కళాశాల, కొత్తగూడెం.

నాపేరు వాసిరెడ్డి సంధ్యారాణి నేను సింగరేణి మహిళా కళాశాల, కొత్తగూడెంలో బి.యస్‌సి (బి.జడ్.సి.) ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. నేను వివరిస్తున్న ఈ సాంప్రదాయ జ్ఞానం మా తాతయ్య లాలిరెడ్డి గారి మార్గదర్శకత్వంతో సేకరించాను. హనీబీ జరిపే ఆయుర్వేద మొక్కల శోధనలో నేను నావంతు కృషి చేయాలని వీటిని సేకరించి పంపుతున్నాను. హనీబీ ఇంకా ఎన్నో శోధయాత్రలు చేసి గ్రామాల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని కోరుకుంటున్నాను. హనీబీ సంస్థ విద్యార్థులలో దాగివున్న జ్ఞానాన్ని, సృజనాత్మకతను వెలికి తీసి మన దేశాభివృద్ధికి పాటుపడే సంస్థగా మా తెలుగు లెక్చరర్ డా. కనకదుర్గ గారు మాకు తెలియజేశారు. మొక్కలలో దాగివున్న ఔషధ శక్తుల పరిజ్ఞానాన్ని పెద్దల దగ్గర గ్రహించి 'పల్లెసృజన'కు పంపుతున్నాను.


**1. మొలలు, బోదకాలు నివారణకు :**

కరక్కాయ గింజలు తీసివేసి మట్టి మూకుడులో కరక్కాయ ముక్కలు వేసి మునిగే వరకు ఆవు మూత్రం పోసి, ఒక రాత్రంతా నాన బెట్టి ఉదయం ఎండలో పెట్టాలి. ఇలా మూడు సార్లు చేయాలి. ఎండిన తరువాత వాటిని దంచి పొడిచేసి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఉదయం అరచెంచా, రాత్రి అరచెంచా నోట్లో వేసుకుని మజ్జిగ తాగితే తగ్గిపోతుంది.



**2. పక్షవాతం, మూర్ఛ, రక్తపోటు, క్రొవ్వు (కొలెస్ట్రాల్), తుంటి, నడుము, కీళ్ళ వ్యాధులు, తిమ్మిర్లు, పొట్ట కరుగుటకు, నరాల బలహీనతకు:**


వాయిలాకు చిగుర్లు 100 గ్రా., వాము 100 గ్రా., మిరియాలు 100 గ్రా., వెల్లుల్లి 100 గ్రా., ఇంగువ 20 గ్రా., అల్లం రసం 100 గ్రా., వాయిలాకును ఆరబెట్టి పొడి చేసి, వాము, మిరియాలు దోరగా వేయించి, ఇంగువను పొంగించి, అల్లం పొట్టు తీసి రసం చేసి వీటన్నింటిని కలిపి నూరి బఠాణి గింజంత గోలీలు చేసి ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి. పై వ్యాధులు ఉన్నవారు భోజనానికి అరగంట



పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.

**పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.**

ముందు ఉదయం ఒకటి, సాయంకాలం ఒకటి చొప్పున నీటిలో వేసుకుని త్రాగినట్లయితే వ్యాధులు వారం రోజుల్లో తగ్గుతాయి. ఈ మందు వాడేటపుడు ఆలుగడ్డలు, పెరుగు, శనగపిండి, మాంసము తినరాదు.



**3. అల్సర్ :** అల్లం రసం, బెల్లం, నల్ల నువ్వులు సమపాళ్ళలో కలువుకొని తింటే అల్సర్ తగ్గుతుంది.

**4. అరికాళ్ళలో ఆనెలు, శరీరంలో ఏ చోటనైనా గడ్డలు అయినప్పుడు :**

కలబంద పైపొట్టు తీసి పసుపు అద్ది ఆనెలపై పెట్టి కట్టు కట్టి రాత్రంతా ఉంచాలి. వారం రోజులు క్రమం తప్పకుండా చేస్తే ఆనెలు కరిగిపోతాయి. శరీరంలో గడ్డలు ఉన్నవారు ఇవి తిన్నచో గడ్డలు కరిగిపోతాయి.

**5. తామర :** శరీరంపై తామర అయినపుడు ఉమ్మెత్త ఆకు నూరి దానికి పసుపు కలిపి ఆ ప్రదేశంలో రాసినట్లయితే తామర తగ్గుతుంది.



**6. చుండ్రు :** మెంతులు, నిమ్మరసంలో నాలుగు గంటలు నానబెట్టి రుబ్బి తలకు రుద్దుకొని ఒక గంట తర్వాత కుంకుడు కాయ రసంతో తల స్నానం చేస్తే తగ్గుతుంది.

**7. పేను కొరుకుడు :** నిమ్మరసం వెల్లుల్లి రసం సమంగా కలిపి వెంట్రుకలు లేని దగ్గర గట్టిగా రుద్దాలి. వారం వరకు తలస్నానం చేయకూడదు. ఇలా ఒక వారం చేస్తే ఆ తరువాత వెంట్రుకలు వస్తాయి.

**8. తలనొప్పి :** బీట్‌రూట్ రసంలో ముంచిన దూదిని చెవిలో పెట్టుకుంటే ఎంతటి తలనొప్పయినా తగ్గుతుంది.

**9. నీళ్ళ విరేచనాలు :** సీమచింత బెరడు పంచదార కలిపి నూరి తగు మోతాదులో చిన్న పిల్లలకు త్రాగించినట్లయితే నీళ్ళ విరేచనాలు తగ్గుతాయి.

**10. తేలు కాటుకు మందు :** తేలు కుట్టినచోట ఆవాలు, బెల్లం కలిపి నూరి ముద్దలా చేసి కడితే విషం విరుగుతుంది. లేదా పెద్ద కసువింద ఆకులు నమిలి తేలుకుట్టిన వారికి కుడివైపున కరిస్తే ఎడమ చెవిలో, ఎడమ వైపున కరిస్తే కుడి చెవిలో ఊదితే విషానికి విరుగుడు జరుగుతుంది.

**11. గజ్జి, కురుపులు :** కాకర ఆకును రసం చేసి ఒంటికి పట్టిస్తే గజ్జి తగ్గుతుంది.

**12. జిట్టలకు మందు :** జిల్లేడు వేరు బెరడు, వెల్లుల్లి, ఈ రెండింటిని నూరి ముద్దలా చేసి జిట్టలు ఉన్న ప్రదేశంలో గుడ్డలో కట్టాలి. అలా రెండు, మూడు రోజులు చేస్తే జిట్టలు రావు.

**13. గాయాలకు మందు :** పరిక చెట్టు చెక్క, మిరియాలు కలిపి నూరి గాయం ఉన్నచోట రాస్తే వారం లోపులో గాయాలు నయమౌతాయి.

**14. నోటి దుర్వాసన, చిగుళ్ళ వెంట రక్తం కారుట, దంత వ్యాధులకు :**

ఉత్తరేణి చెట్టు వేళ్ళు, మామిడి పుల్లలు, మర్రి, మేడి, జువ్వి, వేప, కానుగ, రేగి, చండ్ర, దానిమ్మ, నల్లతుమ్మ, నేరేడు, మారేడు.. వీటన్నిటి బెరడ్లుగాని, లేక కొన్నింటిని గాని తీసుకొని దంచి నీడలో ఎండబెట్టి, దంచి పొడి చేసి జల్లెడ పట్టి సీసాలో నిల్వ చేసుకుని రోజూ ఉదయం దంతాలను శుభ్రపరచుకుంటే పై వ్యాధులు నయమౌతాయి.

**15. వాత రోగాలు, కీళ్ళ నొప్పులు, గ్యాస్, ఎసిడిటీ (అజీర్తి), జలుబు సంబంధ రోగాలు రాకుండా నివారణకు :**

కరక్కాయ, తునికాకు, ఉసిరికాయ ఈ మూడింటిని నూరి, గోళీలాగా చేసుకుని రోజుకు ఒకటి చొప్పున వేసుకుంటే పైన తెలిపిన రోగాలు రాకుండా, ఉన్నవారికి క్రమంగా తగ్గుటకు గొప్పగా పనిచేస్తాయి.

**16. కాళ్ళ నొప్పులు :**

జిల్లేడు పాలు, లేదా జిల్లేడు ఆకును నూనెలో వేయించి, చల్లార్చి దానిని గుడ్డలో కట్టి వాపు ఉన్న ప్రదేశంలో కట్టినట్లయితే తగ్గిపోతాయి.

**17. చెమ్మ ఆకు :** నీళ్లలో చెమ్మ ఆకును వేసి వేడి చేసి ఆ నీళ్లతో పసిపిల్లలకు స్నానం చేయించినట్లయితే చర్మం పై పొట్టు పోతుంది.

**18. బొప్పాయి :** బొప్పాయి పాలను పుచ్చు పళ్ళు ఉన్నచోట దూదితో అద్దినట్లయితే పుచ్చు పళ్ళు సాధారణ పళ్ళుగా మారతాయి.

**19. కలబంద :** కలబంద జిగురును మ్రింగినట్లయితే ఒంటిలో వేడి ఉన్న వారికి తగ్గిపోతుంది. (గర్భిణీ స్త్రీలు కలబంద వాడరాదు)

**20. వాయిలాకు :** వేడి నీళ్ళలో వాయిలాకును వేసి ఆ నీటితో బాలింతలకు స్నానం చేయించినట్లయితే ఒళ్ళు నొప్పులు తగ్గుతాయి.


**21. వేడి వలన శరీరంలో ఏర్పడే గడ్డలను నిరోధించుటకు మార్గం :**

బ్రయోఫిల్లమ్ (రణపాల) ఆకును తీసుకొని దానిమీద మంచి నూనె వ్రాసి కొద్దిగా వేడి చేసి గడ్డ ఏర్పడిన చోట గుడ్డతో కట్టుకోవాలి. ఇలా రోజూ నిద్రపోయే ముందు కట్టుకొని ఉదయాన్నే తొలగించాలి. ఇలా వారం రోజులు చేస్తే గడ్డలు మటుమాయం అయిపోతాయి.

## ఉపాధిహామీ పథకంలో మార్పు కావాలి

# హామీ పథకం శ్రమతో పాటు జ్ఞానపరంగా ఉంటే!

### స్వల్ప కాలంలో భారతదేశ స్వరూపం మారేందుకు పది సూత్రాలు




**ప్రొ. అనిల్ గుప్త**

(ఆంగ్లమూలం కావాలంటే
E-mail : honeybeeap@gmail.com
సంప్రదించండి - ఎడిటర్)




* సుమారు రెండున్నరకోట్ల జనాభాను 100 రోజులు కేవలం కూలి పనులలో మాత్రమే ఎందుకు ఉపయోగించాలి? పేదవాడికి కనీస జ్ఞానం లేదా? స్థానిక వనరుల పట్ల అతనికి వున్న పరిజ్ఞానాన్ని మనం ఎలా ఉపయోగించు కుంటాం? ఈ జ్ఞానం నుండి లభ్యమయ్యే సదుపాయా లను గుర్తించండి, మంచి విధానాలను క్రోడీకరించండి, వస్తువులను / సేవలకు రూపొందించండి, వాటిని విక్రయిం చండి. ఈ విధంగా సాంప్రదాయక జ్ఞానం, నైపుణ్యం కల్గిన సుమారు రెండున్నర కోట్ల ఔత్సాహికులను తయారు చేయండి. 10 సంవత్సరాలలో మనకు అసలు తప్పనిసరి పని కల్పించే విధానం అవసరమే వుండదు. కళాశాలల్లోని యువత ఇలాంటి విషయంలో చాలా ఉపయోగ పడతారు. NSS స్థానే NIF ను ప్రవేశ పెట్టి, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కార్మికులు, మెకానిక్కులు, వ్యవసాయ కూలీలు, రైతులు, వృత్తి విద్యా నిపుణులు, కళాకారులు మొదలైన వారిని ఈ రెండున్నర కోట్ల మందిలో గుర్తించడమే ముఖ్య ఉద్దేశ్యం.



* చిన్న ఆర్థిక సంఘాలు పొదుపు చేసే మొత్తంలో కనీసం ఒక్క శాతం వారు తయారు చేసే వస్తువులు కొనుగోలు చేయడానికి ఉపయోగించడం లేదు. మనం వర్టికల్ మార్కెటింగ్ మీద చేస్తున్న పరిశోధనలు, సమాంతర మార్కెటింగ్ మీద చేయడం లేదు. మనము కొనుగోలు చేసే దాంట్లో కొంతశాతం తప్పనిసరిగా క్రిందిస్థాయి వారు తయారు చేసే వస్తువుల కొనుగోలుకు ఉపయోగించాలి. వీటిలో ఆహార పదార్థాలు, తినుబండారాలు ముఖ్యమైనవి. స్వగృహ ఫుడ్స్ లాంటి సంస్థలలో తయారయ్యే సాంప్రదాయక వంటలు రుచిగా, శుచిగా, పోషక విలువలు కలిగి వుంటాయి. గొప్పవాళ్ళు తరచూ తీసుకునే ఆహారం అతి తక్కువ స్థాయిదిగాను, పేదవాళ్ళు తరచుగా తీసుకునే ఆహారం అతి ఎక్కువ పోషక విలువలు కల్గినదిగాను, గొప్పగాను వుంటుంది.

* విజ్ఞానులై వుండి ఆర్థికంగా వెనుక బడి వున్న అనేకమంది నైపుణ్యంతో మన జీవితాలను ప్రభావితం చేసుకుంటూ కొంత సొమ్ము కొనుగోళ్ళ రూపంలో వారికి చేరేట్లు చేయాలి. సృజనాత్మక భారతీయ సంస్కృతికి మనం ఒక చక్కని వెబ్ పోర్టల్‌ను రూపకల్పన చేయాలి. రామాయణ గాథలు, జానపద కథలు, పల్లెపాటలు, నాటికలు, దాసరి భాగవతాలు లాంటివెన్నో ప్రజలకు అసాధారణ మనశ్శాంతిని ఇస్తాయి. అలాంటివి వెబ్ పోర్టల్‌లో లభ్యమైతే చాలా ఆనందంగా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవటానికి సిద్ధపడతారు. ప్రతి డౌన్‌లోడ్‌కి ఒక రూపాయి చొప్పున పల్లె కళాకారులకు (స్వంతదారులు) చెందాలి. ఈ విధంగా సంస్కృతి పరిరక్షణ పల్లెకళలను ప్రోత్సహించడంతో పాటు వారి జీవన భృతిని కూడా పెంపొందించే అవకాశం కలుగుతుంది. ఈ విషయంపై ఐఐఎం, అహమ్మదాబాద్ విద్యార్థులు ఒక ప్రాజెక్టు రిపోర్టు కూడా సమర్పించారు.







* దేశంలో ప్రతిసంవత్సరం దాదాపు అయిదు లక్షల టెక్నికల్ విద్యార్థులు ప్రాజెక్టు రిపోర్టులు సమర్పిస్తున్నారు. కాని అవి ఎంతవరకు అమలు చేయబడుతున్నాయి?, ఎంతవరకు ఉపయోగ పడుతున్నాయి?. మనం ఒక ప్రాజెక్టును 'రిలే' (ఖోఖో ఆటలా) తరహాలో ఒక కళాశాల నుండి మరో కళాశాలకు, అక్కడినుండి మరో కళాశాలకు అలా అందిస్తూ పోతూ వుంటే చివరికి అది సమాజానికి ప్రయోజనకరమైన ప్రాజెక్టుగా మారి మార్కెట్ చేయడానికి సాధ్యమౌతుంది. చిన్న పరిశ్రమల ఇబ్బందులు విద్యార్థులకు తెలీడం లేదు. అలాగే క్షేత్రస్థాయి పరిశోధకులతో కలిసి వారు పనిచేయడం లేదు. కనీసం ఒక్క శాతం ప్రాజెక్టులు నిజమైన సమస్యలకు పరిష్కారాలను సమకూరిస్తే సంవత్సరానికి ఐదు వేల సమస్యలు పరిష్కరించ బడతాయి. ఈ పరిష్కారాలను మనం చిన్నతరహా పరిశ్రమలు, మరియు సామాజిక వర్గాల ద్వారా ప్రజలవద్దకు తీసుకెళ్ళాలి. అలాగే వారి ఆలోచనలను మార్కెట్‌లోకి తీసుకు రావాలి. దీంతో మనం ప్రాజెక్టులు వ్రాసే పరిశ్రమలను కూల్చి వేయగలం. **మౌలిక ప్రజ్ఞ (ఒరిజినాలిటీ) పై ప్రీమియం పెట్టడంతో సృజనాత్మక సహకరణ మరియు సానుభూతులతో సమ్మిళితమైన సంస్కృతికి మన విద్యార్థులు రూపకల్పన చేయాలి, జన్మనివ్వాలి.**

* భారతదేశంలోని 172 జిల్లాల్లో భారత రాజ్యాంగ శాసనాలు పూర్తిగా అమలు కావడం లేదు. న్యాయ నిర్ధారణలో, శాంతి, భద్రతల నిర్వహణలో వివిధ తీవ్రవాదుల ప్రమేయం ఎక్కువగా ఉంటోంది. నిజం నిర్ధారణ చేయకుండా హింసా మార్గం సమస్యలను ఎన్నటికీ పరిష్కరించలేదు. ప్రభుత్వం కూడా హింసామార్గం అవలంభిస్తే అది మరిన్ని అనర్థాలకు దారి తీస్తుంది. నీరు, భూమి, అడవుల నుండి విడదీయబడి, మోసపోయిన బీద ప్రజలు మరిన్ని కష్టాలకు గురి కాకుండా, వారి జ్ఞాన హక్కుల పోరాటంలో తోడ్పడటానికి ఇన్‌సర్‌జెన్సీ కార్యక్రమాన్ని మనం ప్రారంభించ గలమా? జాతీయ జ్ఞాన కమిషన్ మెజారిటీ జనాభా జ్ఞాన సంపదతో తెగతెంపులు చేసుకుంది. ఈ కమిషన్ నైతికతను చరిత్రే నిర్ణయిస్తుంది.



* నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఫిబ్రవరి 2000 సం.లో సుమారు 12,000 తో మొదలు పెట్టి 500 జిల్లాల్లో 70,000 పైచిలుకు సాంప్రదాయ విజ్ఞాన పరిశోధనలను సంగ్రహించింది. వీటిలో ఎన్ని పరిశోధనలు కళాశాల, పాఠశాలల విద్యార్థులకు తెలుసు? వీటిలో ఎన్ని వ్యవసాయ దారుల పొలాల్లో, వర్క్‌షాప్‌లలో ప్రయత్నింప బడ్డాయి? పరీక్షింపబడ్డాయి? వీటిలో చాలా వరకు ఎలాంటి నిబంధనలు లేక అందరికీ అందుబాటులో వుండగా, కొన్ని మాత్రం భారతదేశం, అమెరికా లాంటి దేశాల్లో పేటెంట్ హక్కులు కలిగి వున్నాయి. సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, సంస్కృతి రంగాల్లో వున్న అభివృద్ధి సంస్థలు ప్రజలతో కలిసి వారి సృజనాత్మకతను ఉపయోగించి, "పల్లెప్రజలు సమాజ అభివృద్ధికి ఉపయోగ పడరు" అన్న మనోభావాన్ని మార్చగలదా? గత మూడు సంవత్సరాల్లో ఐసిఎంఆర్, సిఎస్ఐఆర్‌లతో ఎన్ఐఎఫ్ భాగస్వామ్యం దాని ప్రయోజనాత్మక ఫలితాలు మనకు తెలిసినవే కదా. శాస్త్ర విజ్ఞానానికి అశాస్త్రీయ జ్ఞానానికి మధ్య వారధి సత్ఫలితాలు చూపించడం ఆరంభమైంది. ఈ విషయంలో చేయవలసింది ఇంకా ఎంతో వుంది. ప్రజాధనంతో నడిచే ప్రతి విద్యా సంస్థకు ఇలాంటి పల్లె విజ్ఞానాన్ని ప్రోత్సహించడాన్ని విధిగా ఎందుకు అమలు చేయడం లేదు? పరోక్ష పన్నులు ప్రజల ఆదాయంపై ఆధారపడవు కాబట్టి ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయాన్ని తెచ్చి పెడతాయి. అందుకే బీదవారు ధనవంతులకంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తారు. అందుకే పై సూచన పన్నులు చెల్లించే కొందరికి వెసులుబాటుగా వుంటుంది. అంతేగాక ఇది విద్యా సంస్థలను జ్ఞానవంతులైన పేదలతో సంధానం చేస్తుంది. ఈ జ్ఞాన సంధానం ప్రస్తుత సమాజంలో వున్న లోటును పూరిస్తుంది.





✱ పల్లెనుంచి ప్రపంచానికి : భారతదేశం స్వల్ప ఖర్చుతో అందుబాటులో వుండే పరిష్కారాలను వికాసపథంలోని ప్రపంచ దేశాలకు సమకూర్చ డంలో నాయకత్వం వహించి, ఒక ఉదార, అతి శక్తివంతమైన ఆలోచనా విధానాన్ని సూచిస్తుం దా? పాశ్చాత్య దేశాలు సూచించే పరిష్కారాలు, మార్గాలు అత్యంత ఖర్చుతో కూడుకున్నవి. అసంబద్ధమైనవి. చైనా దేశం చూపే పరిష్కార మార్గాలు ఒకింత ఖర్చు తక్కువ అయినప్పటికి, అవి ఎక్కువ పరిమాణంలో తయారయ్యేవి కాబట్టి అందుబాటులో ఉండేవి. అయినప్పటికి స్థానికంగా తయారు చేయడానికి ఔత్సాహికులకు అవకాశాలు కల్పించడానికి దోహద పడవు. దౌత్య పాలసీలో భాగంగా భారతదేశం ఇన్నోవేటర్లకు ఆర్థిక పరిహారం ఇచ్చి వారి ఇన్నోవేషన్లను ఉచిత ఆధార పరిష్కార పద్ధతిలో (ఓపెన్ సోర్స్) ప్రవేశ పెట్టాలి. పెట్టుబడులకు ప్రత్యేక ప్రణాళికను, విధానాన్ని తయారు చేయాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉద్యోగావకాశాలను పెంచడానికి పెట్టుబడి తెచ్చే అవకాశాలను సృష్టించాలి. ఇది ఇన్నోవేషన్, పెట్టుబడి, పరిశ్రమ అనే ఈ మూడు ప్రధాన రంగాలమధ్య అంతర్జాతీయంగా ఒక కలయిక ఏర్పడాలి. చైనా ఇప్పటికే 'హనీబీ' మార్గంలో ప్రయాణం మొదలు పెట్టింది. బ్రెజిల్, ఇథియోపియా, ఫిలిప్పీన్స్, మలేషియా, ఇండోనేషియా మరెన్నో ఇతర దేశాలు ఈ దిశలో ఆలోచిస్తున్నాయి. మనదేశంలో క్షేత్ర స్థాయిలో తయారైన వస్తువులను ఆరు ఖండాల్లో ఇప్పటికే ఎన్.ఐ.ఎఫ్. మార్కెట్లు చేస్తోంది. సరిక్రొత్త ప్రపంచీకరణ ఆవిష్కరణ కు నాంది పలుకుతోంది.



✱ ప్రాథమిక విద్యాస్థాయిలో ఇలాంటి పరిశోధనలకు సంబంధించిన విషయాలను అధ్యయనం చేయడానికి ఇప్పటికే అక్కడి ఉపాధ్యాయుల సహకారంతో నా మిత్రుడు ప్రొఫెసర్ విజయ్ షెర్రీచంద్ కార్యక్రమాలు ప్రారంభించాడు. చాలావరకు వీటి పరిష్కారానికి ఎక్కువ డబ్బుకన్న ఎక్కువ కాలం అవసరం. ఇటీవల ఇలాంటి పరిశోధనల విషయంలో తగు ప్రోత్సాహం ఇవ్వడానికి వివిధ విధానాలు రూపకల్పన చేయవలసింది గా పోస్టల్ శాఖవారు కోరారు. ప్రతి పోస్టుమ్యాన్‌ను సృజనాత్మక వ్యక్తులను గుర్తించడానికి ఒక స్కౌట్‌లాగా తయారు చేయాలి అన్నది నా మొదటి సలహా. సృజనాత్మక మేధస్సుగల వ్యక్తుల ఉనికి మ్యాపు తయారు చేసుకొని దానిని ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ వుంటే అది సమాజంలోని అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనకారిగా వుంటుంది. అలాగే చొరవ చూపే సంస్కృతి, పరిశోధన, భాగస్వామ్యం మరియు స్థానిక స్థాయిలో సమాజానికి ఒక మంచి చేసే విధానం సంస్థాగతం అవుతుంది.



**9.** మార్కెట్ ప్రజల కష్టాలను గుర్తించదు. ప్రభుత్వాలు దీనికి మద్దతు పలుకుతున్నాయి. ఈ విషయంలో మరింత స్పష్టత కల్గించ వలసిన బాధ్యత సమాజానిది, సమకాలీన సాంఘిక ఉద్యమాలది. సృష్టికారకం కానివ్వండి, వినాశ కారకం కానివ్వండి ఒక తిరుగుబాటుకు మూలం సమాజం. మన గ్రహణశక్తిని మరింత సంవేదన పూరితంగా తయారు చేయాలి. సామాజిక ఉద్యమాలు, సామాజిక తిరుగుబాట్లలో అంతర్లీనంగా ఉన్న శక్తిని మనం విషయ సేకరణకు, బాధ్యతాయుత కార్యకలాపాలకు ఉపయోగించుకునే దిశలో ఆలోచించాలి. అలాంటి ఉద్యమాలను మనం దారిలోనికి తెచ్చుకొని జాతీయ స్థాయిలో సామాజిక తిరుగుబాట్లపై చర్చకు ద్వారాలు తెరచినట్లయితే, సమాజంలో రేకెత్తే అలజడి, అసంతృప్తుల నుండి మనం ఎంతో నేర్చుకునే అరుదైన అవకాశం లభిస్తుంది. ఏ ఇతర దేశం ఇలాంటి సాహసానికి పూనుకోలేదు. ఈ విధానం ద్వారా దేశం తన బాధ్యతలను మరొకరితో పంచుకునే అవకాశం లభిస్తుంది. ఈ కేంద్రీకృత తిరుగుబాటు సామర్థ్యంతో తిరుగ బడుతుంది. నాగరిక జీవితంలో అసమ్మతి అనేది ఉప్పు లాంటిది. ఈ విషయంలో ఒక్క భారత దేశమే చొరవ చూపగలదు.




✱ పరిశోధన భిన్న ఆలోచనలకు, విభిన్న వృత్తులకు ఒక దిశా నిర్దేశం చేసే స్విచ్ లాంటిది. విస్తృతంగా సమాజ సేవ అందించే వారికి అడ్డు వస్తున్న ప్రస్తుత విధానాలను, చట్టాలను దృష్టిలో పెట్టుకుని అలాంటి వారికి ప్రతి ప్రణాళిక (స్కీమ్)లో కనీసం 10 శాతం రాయితీ కల్పించగలమేమో ఆలోచించాలి. ప్రతి సంస్థలో ఉత్పత్తి ఖర్చు తగ్గించడానికి ప్రోత్సాహకాలు ఇచ్చే ఏర్పాటు చేసి ప్రస్తుతమున్న నిశ్చిత లేదా సత్యదూరం కాని, గీచిన గీటు దాటడానికి వీలుకాని ఈ సిద్ధాంతాల నుండి చట్టాల నుండి ఒకింత భిన్నంగా తీవ్రవాద మార్పు, పెనుమార్పు తీసుకు వచ్చే దిశగా ఆలోచించవలసిన అవసరం ఎంతైనా వుంది. సమాజ మార్పులకు అనుగుణంగా లేని బూజు పట్టిన పాత సిద్ధాంతాలను, చట్టాలను మార్పు చేసుకోవలసిన దశలో ఆలోచించాలి. అభిప్రాయ భేదాలను, విభిన్న ఆలోచనలను, బహుముఖ విస్తరణను దృష్టిలో పెట్టుకొని నిరంతర పరిశోధనలు సాగించినట్లయితే దేశాభివృద్ధికి ఒక స్థిరమైన, ఆమోద యోగ్యమైన రూపకల్పన చేయవచ్చు. ఇది ఎండమావి, మిథ్య అనే పదానికి తావులేకుండా చేయవచ్చు.

# సునీత సేకరించిన సాంప్రదాయ జ్ఞానం



డి. సునీత
బి.జడ్.సి. 2వ సం. (తె.మీ.)
సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల
జి.ఆర్. బస్తీ, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా.

హనీబీఏపి కార్యక్రమాల ప్రేరణతో సింగరేణి మహిళా కళాశాలలో ఏర్పడిన 'స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్'లో సభ్యురాలైన సునీత పల్లె జ్ఞానాన్ని సంపాదించాలన్న జిజ్ఞాసతో ఈ క్రింద తెలిపిన సాంప్రదాయ వైద్య జ్ఞానాన్ని తాతయ్య మాన్‌సింగ్, నానమ్మ లక్ష్మి, ఆమె తండ్రి రాందాస్ ల నుండి సేకరించి, పల్లెసృజనకు పంపింది. ఈ ప్రక్రియలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కనకదుర్గ మరియు బాటనీ లెక్చరర్ డా. రమణ గారల ప్రోత్సాహమే ఈ సేకరణకు మూలం. హనీబీఏపి ఈ పల్లె జ్ఞానాన్ని ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదాబాద్‌లో రిజిష్టర్ చేసి, ప్రామాణికం చేయడానికి ప్రయత్నిస్తోంది. - ఎడిటర్.

**బండి గుర్‌జాకు** : ఈ ఆకును నూరి రసాన్ని శరీరంలో నొప్పివున్నచోట రాస్తే నొప్పి త్వరగా తగ్గుతుంది.

**పాపత్రి ఆకు** : రక్తపోటు, మధుమేహం (చక్కెర వ్యాధి) వున్నవారు ఈ ఆకును తింటే పై రోగాలు తగ్గుముఖం పడతాయి. ఈ ఆకు కొంచెం చేదుగా వుంటుంది. ఈ ఆకును నీడలో బాగా ఎండిన తర్వాత పొడి చేసుకుని నీళ్ళలోగాని, కాఫీలోగాని వేసుకుని త్రాగితే మంచిది.

**అంజీర్** : అంజీర్ కాయను పాలలో బాగా మరిగించి, ఆ పాలను తాగితే రక్తవృద్ధి బాగా జరుగుతుంది.

**తులసి ఆకు** : నోటి దుర్వాసన గల వ్యక్తులు నాలుగు లేదా ఐదు తులసి ఆకులను పరగడుపున నమిలితే నోటి దుర్వాసన రాకుండా వుంటుంది.

**కరివేపాకు** : కరివేపాకులను రసం చేసి త్రాగితే కళ్ళకు చాలా మంచిది. కంటిచూపు బాగా అభివృద్ధి చెందుతుంది. ఈ రసం వల్ల కడుపులో వున్న క్రిములు కూడా నశిస్తాయి.

**కలబంద (అలోవీర)** : కలబంద పైన వున్న పొరలను తీసి లోపలి జిగురును రోజూ ఉదయంపూట తింటే జీర్ణవృద్ధి బాగా వుంటుంది.

కలబంద జిగురును ముఖంపై రుద్ది అరగంట తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇలా రోజూ చేస్తే ముఖం అందంగా, ఆకర్షణీయంగా తయారవుతుంది.

**వేప ఆకులు** : వేపాకులను నమిలితే నోటిలో వుండే సూక్ష్మక్రిములు నశిస్తాయి. ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

**చింతాకులు** : మోకాళ్ళ నొప్పి లేదా వాపు వున్నవారు చింత ఆకులను వేడిచేసి లేదా కొద్దిగా ఉడికించి ఆ ఆకులను మోకాళ్ళపై పెట్టి ఒక గుడ్డతో గట్టిగా కట్టు కట్టి కదపకుండా అలాగే వుంచి ఒక గంట తర్వాత తీసేయాలి. అలా నొప్పి తగ్గేంతవరకు చేయాలి. ఇలా చేస్తే నొప్పి త్వరగా తగ్గుతుంది.

**మురిపిండ** : గజ్జి లేదా శరీరంపై దురదలు వున్న వారు ఈ ఆకు రసాన్ని రుద్దితే దురద, గజ్జి తగ్గుతుంది.

**వేపాకు, పసుపు** : వేడినీటిలో కొంచెం పసుపు, వేపాకు రెమ్మలను వేసి స్నానం చేస్తే శరీరంపై వున్న క్రిములు చనిపోతాయి. ఇలా పూర్వకాలంలో ఎక్కువగా చిన్న పిల్లలకు స్నానం చేయించేవారు.

**జొన్నలు** : జొన్న పిండిని రొట్టెలు చేసి తింటే ఆరోగ్యంగాను, బలంగానూ వుంటారు. పూర్వీకులు జొన్న రొట్టెను ఎక్కువగా తినటం వలన వారు ఈ కాలంలో కూడా ఆరోగ్యంగా, బలంగా వున్నారన్న విషయం అందరికీ తెలిసిందే.

**జామ ఆకులు** : జామ ఆకులను నమిలితే నోటి వాసన పోతుంది.

**మఱ్ఱిచెట్టు బెరడు** : మఱ్ఱిచెట్టు బెరడును తీసి నీటిలో బాగా కడిగి, ముక్కలు చేసి, రెండు లేదా మూడు రోజులు ఎండలో ఎండనిచ్చి, ఆ తర్వాత నీడలో బాగా ఎండబెట్టి తర్వాత దంచి పొడి చేసుకుని పలుచని బట్టలో వేసి ఝళితం చేసి ఆ పొడిని చక్కెరలో కలుపుకుని రోజుకు రెండు పూటల తీసుకుంటే, బుద్ధి, జ్ఞాపక శక్తి పెరుగుతాయి. చిన్న పిల్లలకు పావు చెంచా, పెద్దలకు ఒక చెంచా తీసుకోవాలి. దీనిని వాడేటపుడు పులుపు పదార్థాలు తినకూడదు.

**ముల్లంగి దుంప** : ముల్లంగి దుంప రసం కొంచెం వేడిచేసి అయిదారు చుక్కలు చెవిలో వేస్తే చెవుల్లో చేరిన క్రిములు నశిస్తాయి.

**ముల్లంగి రసం** : ముల్లంగి రసం చిటికెడు (అరచెంచా) దోరగా వేయించిన మిరియాల పొడిలో కొంచెం ఉప్పుని కలిపి తీసుకుంటే కడుపునొప్పి తగ్గి, కడుపులో గ్యాస్ హరించిపోయి జీర్ణశక్తి పెరుగుతుంది.

**తేనె** : ప్రతిరోజు క్రమం తప్పకుండా తేనెను తింటే మతిమరుపు వున్న వారికి ఆ సమస్య శాశ్వతంగా తొలగిపోతుంది. ప్రతిరోజు ఉదయం పరగడుపున ఒక చెంచా తేనె, ఒక చెంచా నిమ్మ రసం, అరగ్లాసు గోరువెచ్చని నీరు కలిపి వాడుతూ వుంటే ఇది ఎంతకాలం వాడతారో అంతకాలం కండ్లకు శక్తి తగ్గదు. కండ్లు చక్కగా పనిచేస్తాయి.

ఒక చెంచా తేనెతో మొదలు పెట్టి

పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.

**పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.**

పదిహేను రోజులకోసారి చొప్పున మోతాదు పెంచుకుంటూ, అలా 30 గ్రా. తేనె వరకు తీసుకోవడం వల్ల 'ఎక్కువ కోపం' రాదు. బాలింతలకు చనుబాలు వృద్ధి చెందుతాయి. మూత్రాలలో రాళ్ళు కరిగిపోతాయి. గుండె, లివర్ మొదలగు అవయవాలకు శక్తినిస్తుంది.

**మామిడి ఆకులు :** నాటు మామిడి చెట్టు నుండి మామిడాకులు తీసుకుని, వాటిపై నీరు లేకుండా ఆకులను శుభ్రంగా తుడిచి, ఆకులను చిన్న చిన్న ముక్కలుగా చేసి నీడలో దుమ్ము పడని చోట ఆరబెట్టి అవి బాగా ఎండిన తర్వాత దంచి చూర్ణం చేయాలి. ఆ చూర్ణాన్ని పూటకు అరచెంచా చొప్పున అరగ్లాసు నీటిలో కలుపుకుని రెండు పూటలా భోజనానికి ముందు లేదా తర్వాత సేవిస్తూ వుంటే త్వరగా అతిమూత్ర వ్యాధి హరించిపోతుంది.

**కామెర్లకు సొరకాయ :** సొరకాయ (అనపకాయ) ముక్కలుగా కోసి దంచి రసాన్ని పిండుకొని ఆ రసంలో పటిక బెల్లం వేసి, కలిపి తాగాలి. రోజు రెండు పూటలు ఇలా తీసుకుంటే కామెర్ల రోగం తగ్గిపోతుంది.

**పమిడి పత్తి :** పమిడి చెట్టు ఆకులను మెత్తగా దంచి, పిండి, పసరు తీసి ఆ రసాన్ని రాత్రిపూట నిద్రపోయే ముందు శరీరంపై, కాళ్ళ వాపులు, చేతుల వాపులు మొదలగు వాటికి నాలుగు రోజులు పట్టిస్తే అవి తగ్గిపోతాయి.

**తిప్పతీగ :** తిప్ప ఆకును ఉదయం ఆహారానికి అరగంట ముందు, ఒక ఆకును కడిగి (పెద్ద ఆకు కాదు) కొంచెం కొంచెం నీటిలో వేసుకొని మెల్లగా నమిలి తినాలి. అలా తినటం వల్ల మధుమేహ వ్యాధి అదులోకి వస్తుంది.

**అల్ల నేరేడు పండు :** అల్లనేరేడు పండు తింటే కిడ్నీలో వున్న రాళ్ళు కరిగిపోతాయి. ఈ పండ్లను ఎవరైనా తినవచ్చు. దీనివల్ల ఆరోగ్యం కూడా వృద్ధి చెందుతుంది.

**పుదీన :** పూదీనా ఆకులు పచ్చడి చేసుకుని తింటే జీర్ణశక్తి పెరగడంతో పాటు రక్తవృద్ధి కూడా బాగా జరుగుతుంది.

**నారింజ పండ్లు :** నారింజ పండ్లను తింటే రక్తపోటు (బి.పి.) తగ్గుతుంది.

**వాయిలాకు, వేపాకు :** వాయిలాకు, వేపాకులను నీటిలో బాగా మరిగించి, ఆ నీటితో బాలింతలు స్నానం చేస్తే శరీరంలో వుండే నొప్పులు తగ్గుతాయి.

**దానిమ్మకాయ :** దానిమ్మకాయ తొక్కను దంచి దాని రసం త్రాగితే విరేచనాలు తగ్గిపోతాయి.

**మారేడు పండు :** మారేడు పండు లోపల జిగురు పదార్థం వుంటుంది. దానిని తింటే కడుపునొప్పి తగ్గుతుంది.

**వాము :** వాము, బెల్లం లను కలిపి బాగా దంచి నీటిలో వేసి బాగా కరిగించి, చల్లారిన తర్వాత ఈ కషాయాన్ని ఉదయం, సాయంత్రం తాగితే జలుబు, దగ్గు దగ్గుతుంది.

**అల్లం, వెల్లుల్లి , పసుపు :** అల్లం ముక్క దంచి, రసాన్ని వేడిచేసి, మూడు చుక్కల రసం చెవిలో వేసి తరువాత వెల్లుల్లికి పసుపు పూసి దూదిలా చుట్టి చెవిలో వుంచుకుంటే చెవినొప్పి తగ్గిపోతుంది.

**ఖర్జూరము :** ఖర్జూరము గింజను బుగ్గన వుంచి చప్పరిస్తూ వుంటే కడుపు ఉబ్బరము తగ్గుతుంది.

**మర్రిచెట్టు బెరడు :** మర్రిచెట్టు బెరడు బెత్తెడు ముక్కను తీసుకుని కడిగి, నలగ గొట్టి ఒక పెద్ద గ్లాసు నీటిలో వేసి ఆ గ్లాసులోని నీరు సగానికి వచ్చే వరకు వేడి చేయాలి. ఆ తరువాత ఆ నీటిని వడపోసి గోరువెచ్చగా అయిన తర్వాత ఆ కషాయాన్ని నోటిలో పూసుకుని పుక్కిలించి పూసివేస్తూ వుంటే చిగుర్ల వాపు, నోటిలో పుండ్లు, నాలుకపూత మొదలైన నోటికి సంబంధించిన వ్యాధులు నయమవడమే కాక, చిగుర్లు దంతాలు కూడా గట్టి పడతాయి.

**ఆవు నెయ్యి :** ప్రతి రోజూ ఆహారంలో ఆవునెయ్యిని సేవిస్తూ వుంటే జీవితంలో గుడ్డితనము రానేరాదు. ఆవునెయ్యి వాడేవారికి ఆకలి బాగా వేస్తుంది. శరీరంలో వున్న బలము తగ్గదు. శరీరంలోని వాతము తగ్గుతుంది. అయితే స్వచ్ఛమైన ఆవునెయ్యినే వాడాలి.

**ముల్లంగి రసం :** గొంతువాపు వున్నవారు ముల్లంగి రసాన్ని కొద్ది కొద్దిగా తాగితే వెంటనే గొంతువాపు తగ్గుతుంది.

**సొంఠి, తేనె :** శరీరంలో గ్యాస్ ఎక్కువైనపుడు గుండె నొప్పి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో పావు చెంచా సొంఠి పొడిని ఒక చెంచా తేనెతో కలిపి సేవిస్తూ వుంటే గ్యాస్ తొలగిపోతుంది. గుండెనొప్పి తగ్గిపోతుంది.

**మేకపాలు, సొంఠి :** దోరగా వేయించిన సొంఠి పొడిని ఒక గ్రాము, ఒక కప్పు వేడిగా వున్న మేక పాలతో కలిపి సేవిస్తూ వుంటే గర్భవతులకు, మరియు విషజ్వరం వచ్చిన వారికి తగ్గిపోతుంది.

**ముల్లంగి రసం :** ముల్లంగి రసాన్ని ఒక కళాయిలో పోసి పొయ్యిమీద పెట్టి సన్నని మంటపై మరిగిస్తూ వుంటే రసం ఇగిరిపోయి అడుగున తెల్లని ఉప్పు మిగులుతుంది. దీన్ని రెండు లేదా మూడు చిటికెలు తీసుకుని దాన్ని ఒక చెంచా తేనెలో కలిపి నాలుకపై వేసుకుని చప్పరించి మింగుతూ వుంటే 'ఆయాసం' తగ్గుతుంది.

**తేనె :** వరుసగా క్రమం తప్పకుండా ప్రతిరోజు ఉదయం పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాలు తేనె కలిపి త్రాగాలి. ఒక గంట వరకు మరేమి తినకూడదు. అపుడు శరీరంపై దురద, గజ్జి, తామర వ్యాధులు తగ్గిపోతాయి. తేనెను ఎప్పుడూ వేడి చేసి వాడకూడదు.

ఉదయాన్నే పరగడుపున ఒక గ్లాసు వేడి నీటిలో ఒక టీస్పూన్ తేనె కలిపి తాగితే శరీరంలోని విష పదార్థాలు వెలుపలికి వస్తాయి.

**నిమ్మపండు రసం :** ప్రతిరోజు ఉదయం పూట ఒక నిమ్మపండు రసం, సాయంత్రం పూట ఒక నిమ్మపండు రసం త్రాగితే నిద్ర రానివారికి మంచి నిద్ర పడుతుంది.

రోజూ ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో ఒక నిమ్మపండు రసంలో 50 గ్రా. నీళ్ళు, 20 గ్రా. కలకండ పొడి కలిపి తాగుతూ వుంటే గుండెదడ, నీరసం, కడుపులో మంట, మూత్ర బిగింపు, మలబద్ధకాలు త్వరగా తగ్గిపోతాయి.

**లవంగాల పొడి :** లవంగాలను పొడిగా చేసి పిప్పి పన్నుపై పెడితే బాధ వెంటనే తగ్గిపోతుంది.

**బూడిద గుమ్మడి రసం :** బూడిద గుమ్మడి రసం ఒక కప్పు, చక్కెర చెంచా కలిపి తాగితే అతి వేడి తగ్గుతుంది.

**పల్లె సంప్రదాయ జ్ఞానాన్ని పాటించ దలచిన పాఠకులు గ్రామ వైద్యులను సంప్రదించి వారి సూచనలు సలహాల మేరకు ఆచరించగలరు.**

**చిక్కుడు కాడ** : చిక్కుడు కాయల పొర తింటే శరీరంలో ప్రాణశక్తి పెరుగుతుంది.

**ఉసిరికాయ** : ఉసిరికాయ రసంలో ఒక చెంచా తేనె కలిపి రోజూ తాగుతుంటే నీరసం తగ్గిపోతుంది.

**చింతకాయ** : ఎండాకాలంలో పండు చింతకాయ లతో పానకం చేసి త్రాగితే వడదెబ్బ తగలదు.

**వేపనూనె** : అయిదు చుక్కల శుద్ధి చేసిన వేపనూనె తమల పాకుతో పెట్టి తింటే మూడు వారాల్లో ఉబ్బసం తగ్గుతుంది.

**పనస ఆకులు** : పనస ఆకులను నూరి సెగ గడ్డలపైన పట్టిస్తే అవి త్వరగా పగిలి మానిపోతాయి.

**బంతి ఆకు** : రక్తం కారే గాయాలపై బంతి ఆకుల రసం పిండితే వెంటనే రక్తం కారటం ఆగిపోతుంది.

**నల్ల నువ్వులు** : ఇరవై గ్రాముల నల్ల నువ్వులను మంచినీటిలో మెత్తగా నూరి ఒక కప్పు మేకపాలలో కలిపి ఒక చెంచా కూడా వేసి సేవిస్తూ వుంటే రక్త విరేచనాలు కట్టుకుంటాయి.

**ఎండు ద్రాక్ష పండ్లు** : రెండు కప్పుల పాలల్లో పదినుండి ఇరవై దాకా ఎండు ద్రాక్ష పండ్లు నలగ్గొట్టి వేసి పాలను మరిగించి, ఆ పాలు త్రాగుతూ ఆ పండ్లను తింటూ వుంటే మలబద్ధకం తగ్గిపోయి వంటికి బాగా రక్తం చేరి బలంగా వుంటారు.

**రాగి పిండి** : రాగి పిండిని జావ చేసి తాగితే శరీరానికి చలువ మరియు ఆరోగ్యంగా, బలంగా వుంటారు. ఇప్పటికీ దీన్ని ఎండాకాలంలో వాడుతూ వుంటారు.

**తంగేడు పూలు** : మెడపైన, చర్మం కాలినట్లుగా బొబ్బలు వస్తూవుంటే తంగేడు పూలు తెచ్చి కళాయిలో వేసి కింద మంట పెట్టి నల్లగా మాడ్చి ఆ బూడిదలో తగినంత కొబ్బరినూనె కలిపి మెత్తగా నూరి రోజూ రెండు పూటలా ఆ బొబ్బలపై లేపనం చేస్తూ వుంటే తగ్గిపోతాయి.

**వావిలి చెట్టు** : కాళ్ళు చేతులు తిమ్మిర్లు మరియు మాటి మాటికీ వేళ్లు కొంకర్లు పోతూ వుంటే వావిలి చెట్టు చిగుర్లు పది తీసుకుని నలిచి ఒక గ్లాసు నీటిలో వేసి ఒక కప్పు కషాయం మిగిలేటట్లు మరగబెట్టి వడబోసి అది గోరువెచ్చగా కాగానే ఒక చెంచా తేనె కలిపి పరగడుపున తాగుతూ వుంటే ఈ సమస్య త్వరగా తగ్గుతుంది.

**తిప్పతీగ** : తిప్ప తీగను రోజూ పరగడుపున ఒక ఆకు మోతాదుగా కడిగి తింటూ వుంటే హైబీపి, మధుమేహం (షుగర్) కొలెస్ట్రాల్, గుండె వ్యాధి, ఆయాసం, ఉబ్బసం, చర్మ రోగాలు, మూత్ర పిండ రోగాలు, గర్భాశయ రోగాలు తగ్గిపోతాయి. దీనినే ఆహారంగా కూడా వాడవచ్చు.

**కరక్కాయ, తానికాయ, ఉసిరికాయ** : కరక్కాయ ముక్కలు ఐదు, తానికాయ ముక్కలు ఐదు, ఉసిరికాయ ముక్కలు ఐదింటిని ఒక గ్లాసు నీటిలో వేసి ఒక పగలు, రాత్రి నానబెట్టి ఉదయమే వడపోసుకుని ఆ ముక్కలను తీసివేసి, ఆ నీటిని కొద్ది కొద్దిగా చేతిలోకి తీసుకుని మూసిన కనులపైన కడుగుతూ వుండాలి. ఈ విధంగా క్రమం తప్పకుండా చేస్తూ వుంటే మీ కంటి చూపులో ఎంత తేడా వస్తుందో మీరే ఆశ్చర్యపోతారు.

**తెల్ల ఉల్లిగడ్డల రసం** : తెల్ల ఉల్లిగడ్డ రసం 10 గ్రా., శుద్ధమైన తేనె 10 గ్రా., ప్రశస్తమైన భీమసేన కర్పూరం 2 గ్రా. తీసుకుని వీటన్నిటిని కలిపి నిలువ వుంచుకుని కంది బద్దంత రోజూ రాత్రి నిద్రించే ముందు కళ్ళకు పెట్టుకుంటూ వుంటే క్రమంగా కంటి మసకలు, పొరలు కరిగిపోతాయి. చక్కటి చూపు వస్తుంది. కాని నిలువ వుంచిన పదార్థం పాడు కాకుండా, బూజు పట్టకుండా జాగ్రత్త పడాలి. పాడైతే వాడరాదు.

**బాదం పప్పు** : రాత్రి గ్లాసు నీటిలో ఐదు బాదం పప్పులు నానబెట్టి ఉదయమే పై పొట్టు తీసి ఆ పప్పులతో ఐదు మిరియాల గింజలను కలిపి మెత్తగా నూరి ఆ ముద్దలో తగినంత కండ చక్కెర కలిపి తిని ఒక కప్పు వేడి పాలు త్రాగాలి. ఇలా క్రమం తప్పకుండా వంద రోజులపాటు చేస్తే మీ కంటిచూపు, మెదడు శక్తి, నరాల బిగువు, ఎముకల బలం పెరుగుతాయి.

**వాము** : అజీర్తి కారణంగా కడుపు నొప్పి వస్తే ఒక స్పూను వాముపొడి తింటే తగ్గుతుంది. వాము ఘాటుగా వుంటుంది కాబట్టి పొడి అలాగే తినలేనపుడు గోరు వెచ్చని నీటిలో కలుపుకుని తాగాలి.

**పసుపు** : కడుపులో నులిపురుగులుంటే చర్మం మీద దద్దుర్లు వస్తూ వుంటాయి. అలాంటప్పుడు పరగడుపున ఒకసారి, రాత్రి భోజనానికి అరగంట ముందు ఒకసారి ఒక స్పూను పసుపును ముద్దచేసి మింగాలి. అప్పుడు కపులో వున్న నులిపురుగులు చనిపోయి చర్మంపై దద్దుర్లు తగ్గుతాయి.

**పసుపు, వేపాకు, నువ్వుల నూనె** : వర్షాకాలంలో పాదాలకు, వేళ్ళకు మధ్య పట్టిస్తే పగుళ్ళు పోతాయి.


## పల్లెసృజన పాఠకులు కూడా ఇన్నోవేటర్లు కావచ్చు!

మీరు చేయవలసిందల్లా ఈ సంచికనుండి మేము ఓ అంశాన్ని మీకు ఇస్తున్నాము
అందుకు సంబంధించి మీకు తెలిసిన, మీ గ్రామంలో ఎవరైనా విజయవంతంగా వాడిన పద్ధతులను వివరిస్తూ మాకు వ్రాసి పంపండి
మీరు వ్రాసిన దానిని పత్రికలో ముద్రించడంతో పాటు పంపినందుకు కానుకగా మీకు ఒక సంవత్సరం


పల్లెసృజన

పత్రికను ఉచితంగా పంపుతాము.

అంశం : పార్శ్వపు తలనొప్పి (మైగ్రేన్) నివారణకు సాంప్రదాయ మందు. ఉపయోగించిన వారి వివరాలు, ఉపయోగించే పద్ధతులు

మీ రచనలు పంపవలసిన చిరునామా | ఎడిటర్, పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

# ఆలేరు నుండి అబ్దుల్ కలాం దాకా




## లక్ష్మి ఆసుమిషన్ సృష్టికర్త చింతకింది మల్లేశం


పోచంపల్లి చేనేత కార్మికుల కష్టాలకు ఒక ఉపశమనం కలిగించడానికి 'ఆసుమిషన్' తయారు చేసిన మల్లేశం గురించి పాఠకులకు విదితమే. అతను ఇటీవల అహమ్మదాబాద్ లో జరిగిన వర్క్‌షాప్‌కు హనీబీవిపి ప్రతినిధిగా వెళ్ళటం జరిగింది. అహమ్మదాబాద్ లో మల్లేశం అనుభవాలు తన మాటల్లో 'పల్లెసృజన' పాఠకులకోసం.....

నేను అహమ్మదాబాద్‌లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఇన్నోవేషన్ వర్క్‌షాప్' కు నవంబర్ 26, 2008న వెళ్ళటం జరిగింది. అహమ్మదా బాద్‌లో నవంబర్ 27న అక్కడి 'సృష్టి కార్యాలయం'లో ఈ సమ్మేళనం జరిగింది. నాతోపాటు ఆ వర్క్‌షాప్‌లో దాదాపు 20 మంది ఇన్నోవేటర్లు కూడా పాల్గొన్నారు. ఆయా ఇన్నోవేటర్లు వారివారి ఇన్నోవేషన్లను ప్రదర్శించారు.

అక్కడ పాల్గొన్న ప్రతి ఇన్నోవేటర్ ప్రదర్శనను అందరూ చూసి వాటిమీద అభిప్రాయాలను వెల్లడించాలని కొన్ని ప్రశ్నలతో కూడిన ఒక పేపర్ అందించారు. అంటే నేను కూడా వారి ఇన్నోవేషన్‌ను పరీక్షించాలన్నమాట. అందులో .... సమాజానికి ఈ పరికరం, ఎంతవరకు ప్రయోజనకారిగా వుంటుంది? దీనికి సమాజంలో ఏయే ప్రాంతాల్లో డిమాండ్ ఉంటుంది?, ఆ ఉత్పత్తికి వారు నిర్ణయించిన ధరను ఎంత వరకు కొన గలరు?, ఈ ఇన్నోవేషన్ ఇంతకు ముందు ఉన్నదా లేక కొత్తదా? ఈ ఉత్పత్తి మార్కెట్‌లో పోటీని ఎంతవరకు తట్టుకో గలదు?, ఈ ఉత్పత్తికి ఏ ధర వుంటే ఎక్కువగా అమ్ముడయ్యే అవకాశం వుంది? లాంటి కొన్ని ప్రశ్నలకు ప్రతి ఇన్నోవేటర్ సమాధానం వ్రాసి ఇవ్వాలి.

ఇలా అన్ని ప్రశ్నలకు సమాధానం





ఇవ్వటం ద్వారా ఆయా ఇన్నోవేషన్‌పై వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఆ తర్వాత నవంబర్ 28న మా ఇన్నోవేషన్లను పరిశీలించేందుకు ఇంజనీర్లు, సైంటిస్టులు రావటం జరిగింది వారు ప్రతి ఇన్నోవేటర్ వద్ద ఆ వస్తువును ఎందుకు కనుగొన్నావు?, ఎలా కనుగొన్నావు, ఇది చేయటానికి గల కారణాలు ఏమిటి?, ఇప్పుడు మార్కెట్ ఎలా వుంది? లాంటి వివిధ రకాల ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టుకుని ఆయా ఇన్నోవేటర్లకు అవసరమైన సలహాలు సూచనలు చేయటం జరిగింది.

నవంబర్ 29న ఎన్.ఐ.ఎఫ్. వారు నా ఆసు మిషన్ గురించి గుజరాత్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ అధికారిని పిలిపించి, వారికి ఈ మిషన్‌ను గురించి వివరించటం జరిగింది. అక్కడి చేనేత కార్మికులకు ఈ ఆసుమిషన్ గురించి వివరించి, అహమ్మదాబాద్‌కు 50 కి.మీ. దూరంలో వున్న కల్లోల్ అనే గ్రామంలో చేనేత కార్మికులకు ఈ ఆసు మిషన్ గురించి వివరించి చెప్పడం జరిగింది. ఈ నాలుగు రోజులు నేను



పొందిన ఆనందం మాటల్లో వర్ణించలేనిది. దేశంలోని పెద్ద పెద్ద ఇంజనీర్లు, సైంటిస్టుల సమక్షంలో నేను తయారు చేసిన ఆసు మిషన్ గురించి వారికి వివరించి చెప్పడం, వారు ప్రశ్నలు అడగడం, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్లకు జడ్జిమెంటు చేయడం, ప్రొఫెసర్ అనిల్ గుప్త గారు అమెరికా ప్రొఫెసర్ 'ఎరిక్' గారికి ఆసు మిషన్ గురించి చెప్పడం ఇవన్నీ ఒక ఎత్తయితే ఒక గ్రామీణ యువకుడినైన నేను భారత దేశంలో ప్రతి వ్యక్తి ఒక్కసారైనా కలుసుకోవాలని కలలు కంటున్న భారత మాజీ రాష్ట్రపతి 'అబ్దుల్ కలాం' గారితో మాట్లాడే అవకాశం కలగటం నా జీవితంలో ఇంతకన్నా మధురమైన ఘట్టం మరోటి లేదు.

నేను తయారు చేసిన ఆసు మిషన్ గురించి అబ్దుల్ కలాం గారికి వివరించి చెప్పాను. వారు ఏ ప్రాంతం నుంచి వచ్చావు అని అడిగారు. ఈ మిషన్‌ను ఎందుకు చేశావు? దీనికి కారణం ఏమిటి? ఇప్పుడు ఎలా పని చేస్తుంది అని అడిగారు. నేను వీడియో ద్వారా చూపించాను అది చూసి చాలా బాగుందని అభినందించి, నీలాంటి ఇన్నోవేటర్లు గ్రామీణ స్థాయిలో ఎందరో వున్నారు, వారు కనిపెట్టిన దాన్ని సమాజానికి అందించి, సమాజ అభివృద్ధితో పాటు వారి అభివృద్ధికి కూడా తోడ్పడాలని సూచించారు.


ఒక చిన్న స్థాయిలో వున్న నాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చూస్తుంటే నేను ఇలాంటివి ఇంకా ఎన్నో యంత్రాలను కనుగొనాలనే తపన నాలో పెరిగింది. చిన్న గ్రామీణ స్థాయికి చెందిన నాలాంటివాడికి ఇంతటి గుర్తింపు తెచ్చిన హనీబీఏపి కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారికి, అంతర్జాతీయ స్థాయి వ్యక్తులతో నాకు పరిచయం కలిగించి, జాతీయ స్థాయిలో నా ఇన్నోవేషన్‌కు ఒక గుర్తింపు తీసుకు రావాలని తహతహ లాడుతున్న ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఇంతటి తియ్యని అనుభూతులను మీతో పంచుకుంటున్నందుకు నాకు ఇంకా ఆనందంగా వుంది..... మీ,

**చింతకింది మల్లేశం,**
శారాజీపేట, ఆలేరు మండలం.
నల్గొండ జిల్లా.
సెల్ : 92472 82778

## కబుర్లు (ముచ్చట్లు) వ్రాసి పంపండి !

తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల నుండి జ్ఞానానికి సంబంధించిన కబుర్లు మీరు వినడానికి ఎప్పుడైనా ప్రయత్నించారా? ఆ కబుర్లను మాకు వ్రాసి పంపండి. వారి అనుభవాల పొరల్లో ఎన్నో జ్ఞానాలు దాగుంటాయి. ప్రచురణకు అనువైన వాటిని 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. వ్యాసాలను పంపేటప్పుడు మీ ఫోటోతో పాటు మీకు కబుర్లందించిన వారి ఫోటోలకు కూడా తప్పక పంపండి. ఈ అపూర్వ సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, భావితరాలకు అందజేయ టానికి మీ సహకారాన్ని కోరుతు న్నాము.

- ఎడిటర్.



కుదురుపాక జగదీశ్వర్ ప్రయత్నం

# ఇంధనం అవసరం లేని మోటార్ సైకిల్

పైసా ఖర్చు లేకుండా రోడ్లపై తిరగగలిగితే ఎంత బాగుంటుంది. ఇది ఎవరికైనా ఆనందానికి గురిచేసే అంశమే కదూ. ఒక గ్రామీణ యువకుడు కూడా ఇదే ఆలోచనతో కాలక్షేపం చేయకుండా అలాంటి ఒక వాహనాన్ని తయారు చేయడానికి ఉపక్రమించి కృతకృత్యుడయ్యాడు. అతనే వరంగల్ జిల్లా చిన్నారావు పేట మండలం, ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన కుదురుపాక జగదీష్.

ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమౌతున్న ఎలక్ట్రిక్ బైక్‌లు మనం ఇంటివద్ద ఛార్జింగ్ చేసుకుంటే వాటిపై కొన్ని గంటల వరకు మాత్రమే ప్రయాణం సాగించగలం. కానీ జగదీశ్వర్ తయారు చేసిన బైక్‌లో బ్యాటరీ వున్నా, అది ప్రయాణంలోనే రీఛార్జి అవుతూ వుంటుంది కాబట్టి పరిమితంగా ప్రయాణం చేయాలన్న ఆంక్షఉండదు. ఇది ఈ ఇన్నోవేషన్ ప్రత్యేకత.

8వ తరగతి వరకు మాత్రమే చదువుకున్న జగదీష్ తన సోదరులను - ఇన్నోవేటర్లు బ్రహ్మం (గ్యాస్ ఇస్త్రీపెట్టె) మరియు వెంకటేశ్వర్లు (స్పీడ్ బ్రేకర్లతో విద్యుత్తు) - స్ఫూర్తిగా తీసుకుని తనూ ఏదైనా సాధించాలనుకున్నాడు. పెట్రోల్, విద్యుత్తు అవసరం లేకుండా దానికదే ఛార్జింగ్ చేసుకునే ద్విచక్ర వాహనాన్ని రూపొందించాడు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఈ వాహనానికి పేటెంట్ హక్కుల కొరకు దరఖాస్తు చేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు జగదీశ్వర్‌తో చర్చలు జరిపి ఆయన ప్రయత్నం సాధ్యమేనని ప్రమాణీకరించారు.

పాత సుజుకి (మ్యాక్స్ 100) వాహనానికి బోరు, కార్బొరేటర్, ప్లగ్‌లు తొలగించి, ఆ స్థానంలో ఆటో సెల్ఫ్ మోటార్‌ను అమర్చాడు. 70 ఎ.హెచ్. బ్యాటరీని వాహనానికి అమర్చి ముందు, వెనుక చక్రాల్లో బ్రేక్ లైనర్లను తొలగించి ఆ స్థానంలో డైనమోలను బిగించాడు. వాటిని అమర్చడానికి ప్రత్యేకంగా చక్రాలు (వీల్స్) రూపొం దించి డైనమోల నుంచి వాహనం నడిచేటప్పుడు బ్యాటరీ ఛార్జింగ్ అయ్యే విధంగా తీగలతో అనుసంధానించా డు. బ్యాటరీ నుంచి హ్యాండిల్ వరకు కనెక్షన్ ఇచ్చిన రెండు వైర్ల ద్వారా వాహనం సెల్ఫ్ స్టార్టింగ్ అవుతుంది. ప్రస్తుతం 30 కి.మీ. వేగంతో నడుస్తు న్న ఈ వాహనం తయారీకి రూ. 30 వేలు అయినట్లు జగదీష్ తెలిపాడు. ఇంకా డిస్క్ బ్రేకులు, ప్రత్యేక ఎక్స్‌లేటర్లు రూపొందించాల్సి వుందని అంటున్నాడు.


హనీబీఎపి జగదీశ్వర్‌ను అన్ని విధాలా ప్రోత్సహించి, ఆయన ప్రయత్నాలకు తగిన తోడ్పాటును అందిస్తోంది. త్వరలో ఈ వాహనం రోడ్లపైకి వచ్చి జనరంజక మోటార్ సైకిల్‌గా మారుతుందని ఆశిద్దాం.

చిరునామా :

కుదురుపాక జగదీశ్వర్

సెల్ : 93999 79961,
94907 97613

# హైదరాబాద్‌లో జరిగిన




అక్టోబర్ 17, 2008 న హైదరాబాద్ ఉస్మానియా యూనవర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇన్నోవేటర్స్ వర్క్‌షాప్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. బ్రిగేడియర్ గణేశం గారి స్వాగతోపన్యాసంతో కార్యక్రమం మొదలైంది. మొదటగా కార్యక్రమానికి విచ్చేసిన ఇన్నోవేటర్లు తమను తాము పరిచయం చేసుకోవడం జరిగింది. పరిచయ కార్యక్రమాల అనంతరం బ్రిగేడియర్ గారు మాట్లాడుతూ మాగాణి పంటలో బెల్లం ముక్కలు వేయడం వల్ల చీమలు వస్తాయి. అవి తినటం వల్ల క్రిముల గ్రుడ్లు నాశనం అవుతాయి. అందువల్ల పంటలనాశించే పురుగుల నియంత్రణ జరుగుతుంది. సహజంగా ఆకులతో 'అనెస్థీషియా' ఇచ్చే గ్రామీణ వైద్యులు విశాఖ ఏజన్సీల్లో ఉన్నారు. ఒక చెట్టు కొమ్మలను (కొడిశె) చేలో అక్కడక్కడా నాటడం వల్ల 'పెస్ట్ కంట్రోల్' అవుతుంది. అని వివిధ రకాల ఇన్నోవేషన్లను గురించి వివరించి, ఇలాంటి వాటిని వెలుగులోకి తేవటం 'వలంటీర్' లక్ష్యం కావాలని అన్నారు. 'వలంటీర్' అంటే ఎలాంటి అపేక్ష లేకుండా సమాజానికి సేవ చేసేవారని అన్నారు. మారుమూల ప్రాంతాల్లోని ఇన్నోవేటర్లను వెతికి, వెలికి తీయాలని కార్యకర్తలను సూచించారు. ఈ కార్యక్రమం అంతా 'హనీబీ' (తేనెటీగ)లా పని చేయాలని, అంటే ఎవరికీ నష్టం కలగకుండా పని చేయాలని అన్నారు. ఇన్నోవేటర్‌కు, తయారీదారునికి మధ్య వారధిగా మనం పనిచేయాలన్నారు. విజ్ఞానాన్ని తెలుసు కునేందుకు గ్రామాలకు వెళ్ళాలని అన్నారు. ఇలాంటి వాటినే జ్ఞానసముపార్జన యాత్ర అని, మనం చూసేవాళ్ళకి, చేసేవాళ్ళకి, అనుభవించే వాళ్ళకి ఆనందం కలిగించాలి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇలంటి సేవాభావంగల సంఘాలను ఒకతాటిపైకి తేగలిగితే దేశానికి ఇంకా మంచి జరుగుతుందన్నారు. తరిగిపోతున్న జ్ఞానం భవిష్యత్ తరాలకు వెళ్ళాలంటే ఆ జ్ఞానాన్ని రాత పూర్వకంగా నిక్షిప్తం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు.

అనంతరం ఇన్నోవేటర్లు తమతమ ఇన్నోవేషన్లను అతిథులందరికీ చూపించి, వాటిని ఎలా తయారు చేశారు. వాటి పనితనం గురించి వివరించడం జరిగింది. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఇన్నోవేషన్లను గమనించి, తాము పుస్తక జ్ఞానంతో ఇన్నోవేషన్ చేస్తుంటే ఈ గ్రామీణులు ఎలాంటి పుస్తక జ్ఞానం లేకపోయినా, కేవలం తమ ఐడియాలకు రూపమిచ్చి ఇలాంటి వాటిని కనిపెట్టడం పట్ల ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేయడం జరిగింది. అతిథులందరూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒక సూచననిస్తూ మీరంతా వీరు కనుగొన్న వాటిని ఇంకా ఎంతవరకు అభివృద్ధి చేస్తే మార్కెట్‌లో ఇంకా చవకగా అమ్మగలమో సూచిస్తే బాగుంటుందని అన్నారు.



అనంతరం కార్యక్రమ ముఖ్య అతిథి అనిల్ గుప్తా మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్‌లో బ్రిగేడియర్ గారు అతి కొద్ది సమయంలోనే ఎందరో ఇన్నోవేటర్లను పరిచయం చేయడం ఆనందంగా వుందని అన్నారు. ఇంతమంది ఇన్నోవేటర్లను కలుసుకోవటం చాలా ఆనందంగా వుందని మరోసారి తెలియజేస్తూ, ఇప్పటినుండి ప్రతి ఇన్నోవేషన్‌ను తప్పకుండా రికార్డు రూపంలో భద్రపరచి భవిష్యత్ తరాలకు వాటిని అందజేయాలని అన్నారు. మల్లేశం లాంటి చదువులేని వారే, వారి అనుభవాలతో చరిత్ర సృష్టిస్తున్నపుడు ఇంజనీరింగ్ చదివిని మీలాంటి విద్యార్థులు ఇంకెంతటి చరిత్ర సృష్టించగలరో ఒక్కసారి ఆలోచించమని విద్యార్థులకు హితబోధ చేశారు.

# వర్క్‌షాప్ దృశ్యాలు














# బట్టతలపై వెంట్రుకలు మొలిపించే
# వెంగళదాసు నరేష్ 'కేశఖని'



సృష్టిలో మనకు తెలియని నిగూఢ రహస్యాలు అత్యధికం. వీటిలో అత్యంత విలువ కలిగినది ఆయుర్వేద వైద్య విధానం. ఇది మన పూర్వీకులైన మహర్షుల ద్వారా తెలుపబడిన అపార జ్ఞాన సంపద. ప్రకృతిలోని సహజ సంపదను ఉపయోగించి ఎన్నో రకాల మొండి వ్యాధులను సైతం జయించడమే కాకుండా ఎన్నో అద్భుతాలను కూడా సృష్టించిన చరిత్ర మన ఆయుర్వేదానికి వుంది. మానవ జీవితంలోని శారీరక అనారోగ్య లోపాలను సరిచేసే క్రమంలో మనం ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ వన సంపదను ఉపయోగించడం జరుగుతోందని చరిత్ర పుటలు చెబుతున్నాయి. మన దేశ ఆయుర్వేద మహత్యాన్ని విదేశీయులు కూడా గౌరవించి పరిశోధనలు జరిపి మంచి ఫలితాలను సాధిస్తున్నారు. ఆయుర్వేద గ్రంథాలలో తెలుపబడిన ప్రసిద్ధి చెందిన అమూల్య వన మూలికలతో విధివిధానాలతో, నియమనిష్టలతో వ్యయప్రయాసలతో శ్రమటోడ్చి ఈ విలువైన హెయిర్ ఆయిల్ 'కేశఖని'ని తయారు చేశాడు మన గ్రామీణ ఇన్నోవేటర్ వెంగళదాసు నరేష్.


ఖమ్మం జిల్లా, పాల్వంచ గ్రామానికి చెందిన వెంగళదాసు నరేష్ తయారు చేసిన ఈ హెయిర్ ఆయిల్ అత్యంత సులభంగా వాడగలిగే ఔషధము. ఇది వాడదలచిన వారికి కావలసింది ఎక్కువ ఓర్పు. వెంగళదాసు తన అనుభవంలో గమనించిన విషయం ఏమిటంటే చాలామంది తలకు నూనె రాయగానే విరివిగా వెంట్రుకలు మొలవాలని తలుస్తుంటారు. కానీ, అలా ఎలా జరుగుతుందో మాత్రం ఒక్కసారి కూడా ఆలోచించరు. వెంట్రుకలు ఊడిపోవడానికి కొన్ని నెలల నుండి సంవత్సరాలు పడుతుంది. ఆఖరుకు గుండు గీయించుకున్నా కూడా మళ్ళీ క్రాఫ్ రావడానికి కనీసం నాలుగు నుండి ఆరు నెలలు పడుతుంది. అలాంటిది మొదళ్ళతో సహా ఊడిపోయిన తల వెంట్రుకలు మొలకలుగా వచ్చి పెరగడానికి కొద్ది సమయాన్ని అయినా కేటాయించాలి కదా!

వెంగళదాసు తయారు చేసిన ఈ ఆయిల్ తలకు ఒక ఎరువు వంటిది. బీడు భూమిని దుక్కి దున్ని ఎరువు వేసినప్పుడు ఆ నేల సారవంతంగా అయి మొలకలు వచ్చి పంట ఎలా పండుతుందో బట్ట తలపై కూడా ఈ ఆయిల్ రాసినప్పుడు అది తలలోకి చొచ్చుకుపోయి, మృతకణాలను ఉత్తేజ పరుస్తుంది. కొత్త కణాలను పుట్టిస్తుంది. అంతే కాకుండా అవి పెరిగి పెద్దవి కావటానికి తోడ్పడటంలో కావలసినంత సమయాన్ని తీసుకుంటుంది. మరో ముఖ్య విషయం ఏమిటంటే ఆయుర్వేద ఔషధాలు మనిషి యొక్క శారీరక స్థితి గతులకు అనుగుణంగా పని చేస్తాయి. తొందర పడటం, వృథా ప్రయాసతో పాటు మనలోని ఇచ్చను కోరిక చేసి, ఔషధం వాడటం మానేసే పరిస్థితికి దారి తీస్తుంది. ఇక మనకి అసలు వెంట్రుకలు రానేరావు- అనే నిర్ణయానికి వచ్చేలా చేస్తుంది. పంటకు ఎరువు అవసరం అయినప్పుడు అది అందించక పోతే పంట ఫలాన్ని పొందలేము. తప్పు పంటది కాదు - ఎరువు వేయని రైతుది. పంటకు కావలసిన ఎరువును అవసరమైన సమయానికి అందించగలిగి నప్పుడు మనం ఫలాన్ని కూడా సమృద్ధిగా పొందుతాము. ఓపికతో వాడిన వారు తమ తలలపై వెంట్రుకలను పొందడం జరిగింది.

వెంట్రుకలు ఊడిపోవటానికి కారణాలేవైనా సరే మరల మొలిపించి, అందంగా ఆకర్షణీయంగా కనిపించేలా చేయడమే కాకుండా తలకు రక్షణ కల్పించడమే ఈ ఔషధ లక్ష్యం అంటారు వెంగళదాసు నరేష్. ఈ ఆయిల్ వాడటం వల్ల బట్ట తలకు జుట్టు రావడమే కాదు, జుట్టు రాలుట, చుండ్రును అరికడుతుంది. వెంట్రుకలు బలంగా, మెత్తగా, నల్లగా, ఆకర్షణీయంగా అవుతాయి. ఈ ఆయిల్‌కు చాలినంత నూనె చుక్కలు వేసి మునివేళ్ళతో 5 నుండి 10 నిమిషాలు ప్రతిరోజు మర్దన చేయాలి. 3 నెలల్లో సన్నని మెత్తని వెంట్రుకలను గమనించ గలరు. తరువాత కొన్ని నెలలు వాడవలసి వుంటుంది. ఈ ఆయిల్ ధర 60 మి.లీ. రూ. 300లు, 100 మి.లీ. ధర రూ. 500లు. వివరాలకు :

**"వెంగళదాసు నరేష్,**
**14-1-107, మసీదు వీధి,**
**న్యూపాల్వంచ-507115, ఖమ్మం జిల్లా,**
**సెల్ : 92474 73072**

హనీబీఎపి 'కేశఖని'ని ఎన్ఐఎఫ్ వైజ్ఞానికపరంగా పరీక్ష చేయిస్తున్నది. ఫలితాలు నిర్ధారణ అయితే పేటెంట్‌కై ప్రయత్నిస్తుంది.



# 'హనీబీఎపి' కార్యక్రమాలు అద్భుతం

- ఉప్పుతేళ్ళ కృష్ణ, ప్రకాశం జిల్లా.

"ఆంధ్ర ప్యారడైజ్", "పేదోడి ఊటి" అరకు లోయ - విషయంలో ఈ మాటలు అక్షర సత్యాలు. కనుచూపుమేర ఎక్కడ చూసినా హరితారుణము! ఆకుపచ్చటి దుప్పటి కప్పుకున్న గిరులు, తరులు - లోతైన లోయలు, నీలాకాశం లో మిరిసే చుక్కల్లా గిరి శిఖరాలపై మేత మేస్తూ ఆవులూ, గొర్రెలు, పల్లెపడుచు శిరస్సునుండి జారిన స్వేద బిందువుల్లా అక్కడక్కడా శిఖరాల నుండి దుమికే సెలయేళ్ళు, తుంపరలు, కరినాగు మెలికల్లా వంపులు తిరగిన తారు రోడ్లు, ఆకాశంలో 'జుయ్' మంటూ మెలికలు తిరిగే తారా జువ్వలా కొండశిఖరాలపై శబ్దం చేస్తూ నడిచే రైళ్ళు, ప్రపంచమందున్న మొత్తం అందమంతా ఇక్కడే ప్రోగు చేయబడిందా అన్నట్లుండే ఆహ్లాదకరమైన ప్రకృతి. అక్కడే విరివిగా లభించే కర్ర, మట్టి, రాళ్ళతో నిర్మించిన చిన్న చిన్న కాలనీ లోగిళ్ళు, రింగులు తిరగిన వంకీల జుట్టు, చిన్న ముఖం, చప్పిడి ముక్కు, లావు పెదవులు, నల్లటి నగుమోము, మూరెడు 'గోచి' గుడ్డ మినహా మరే ఆచ్ఛాదనా లేని, నిగ నిగ మెరిసే నల్లటి శరీరం, ఇది అక్కడి మగ గిరిజనుల ఆకృతి.

పొడవాటి గుడ్డనే చీరగా చుట్టుకొని, జాకెట్టు వాడటం ఇంకా తెలియని గిరిజన స్త్రీలు, కల్మషం లేని చూపులతో, మోసమే తెలియని, ప్రకృతిని నమ్ముకొని అనేక వికృతులతో జీవించే ఈ గిరజనులు, సెలయేరులోని నీటిలా స్వచ్ఛమైనవారు. అప్పుడప్పుడు టివిలలో, పేపర్ల లో అరకు లోయ గూర్చి, చెప్పినది, చూపించిన జ్ఞానమే కాని, ప్రత్యక్షంగా చూడలేదు. ఇప్పుడు ప్రత్యక్షంగా అక్కడి జీవన విధానం చూస్తున్న నాకు ఒళ్ళంతా పులకరిం చింది. హృదయం సంతోషం తో నిండిపోయింది. కానీ, కించిత్ బాధ కూడా కలిగింది. అది ప్రభుత్వం వారు పంపిణీ చేసే నాలుగు కిలోల రేషన్ బియ్యం కోసం దాహం వేస్తే బిందెడు మంచినీళ్ళ కోసం, వారానికోసారి జరిగే పచారీ వస్తువుల సంతకోసం - ఇద్దరు కూడా ప్రక్క ప్రక్కగా నడక సాగించలేని కాలిబాటలో మైళ్ళకొద్దీ అలా గండుచీమల దండులా కొండలు ఎక్కుతూ నడిచిపోతూనే వుంటారు ఈ గిరిజనులు. వారి అమాయకత్వానికి ఆనందించాలా లేక వెనక బాటు తనానికి మనల్ని మనం నిందించుకోవాలా తెలియటం లేదు.

కొత్త మనిషి కనపడితే, సంబరాలు చేస్తూ, వేటలు, కోళ్ళు కోసి, అతిథులకు మర్యాదలు చేసే గిరిజనులు ఉన్నారంటే మనం ఆశ్చర్యపోక తప్పదు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలవుతున్నా, ఒక్క ప్రభుత్వ అధికారి ముఖం కూడా చూడని ఊళ్ళు ఉన్నాయంటే మీరు నమ్మగలరా, అక్కడి లోకల్ వాలంటీర్ గణేశం సార్‌కు ఈ విషయం చెబుతుంటే ఆశ్చర్యపడటం నావంతు, కిషన్ పవార్ వంతు అయింది. ప్రమాదం జరిగినప్పుడు, మహిళల ఆరోగ్యం బాగా లేనప్పుడు 'డోలీ' ప్రయాణం తప్ప, 108 సేవలు తెలియని ఊళ్ళు లెక్కకు మించి ఎన్నో వున్నాయి.

అలాంటి గిరుల్లో, తరుల్లో, హనీబీఎపి శోధయాత్రకు పూనుకుంది. ఆగిన ప్రతి గ్రామంలో బయట ప్రపంచం గూర్చి వారికి, వారిని గురించి బయటి ప్రపంచానికి తెలియ జేసింది. అక్కడి విశిష్ట వ్యక్తులను సత్కరిస్తూ గౌరవించింది. అక్కడి మూలికా వైద్యం గురించి రిజిష్టర్ చేయించింది. అక్కడ దొరికే విజ్ఞానాన్ని గురించి బయటి ప్రపంచానికి తెలియజెప్పటానికి పూనుకుంది. విలువైన వనసంపదా వుంది, సమృద్ధిగా ఖనిజ సంపదా వుంది. విశాలమైన భూములూ వున్నాయి. లేనివారు నిరుపేదలు, మరి వీరు - అన్నీవున్న నిరుపేదలు. కావలసిందల్లా వారిని జాగృతం చేయడం, అక్కడి సమస్యల పట్ల అవగాహన కల్పించటం, వారికి వారుగా పరిష్కరించుకునేట్లు చేయటం. ఈ విషయంలో హనీబీఎపి కో-ఆర్డినేటర్ శ్రీ గణేశం గారి నేతృత్వంలో మంచి ఫలితం సాధించిందని భావిస్తున్నాం. పల్లె పల్లెకు కాలినడకన తిరిగి, విశిష్ట వ్యక్తులను గౌరవించి, వారి సమస్యలను ఆలకించి, తగు సూచనలు చేసింది హనీబీఎపి. వారివద్ద సాంప్రదాయ బద్ధంగా దొరుకు విజ్ఞానాన్ని రిజిష్టర్ చేసింది. పల్లె ప్రజలతో కలిసి సహపంక్తి భోజనాలు చేసింది. కలిసి కటిక నేలపై పడుకొంది, గిరిజనులతో ఆడింది, పాడింది, ఆనందం పంచుకొంది హనీబీఎపి. ఈ కలయిక ఒక తీపి గురుతుగా జ్ఞాపికలను పంచింది. 'స్వంతలాభం కొంత మానుక, పొరుగు వారికి సాయపడవోయ్' అన్న గురజాడ వారి అమృత వాక్యాలు నిజం చేసింది హనీబీఎపి. ●



# నేను శోధించిన శోధయాత్ర

హైదరాబాద్‌కు చెందిన కుమారి వాణి రూపేల వృత్తిపరంగా 'స్పీచ్ థెరపిస్ట్'. సమాజంపై వున్న ఆసక్తి, పరోపకార భావం, జ్ఞానోపార్జన చేయాలన్న ఉత్సాహం ఆమెను శోధయాత్ర వైపు మళ్ళించింది. ఆమె చూపుల్లో, ఆమె భావాల్లో అరకులోయలో జరిగిన శోధయాత్ర గురించి....

2

- వాణి రూపేలా, హైదరాబాద్

## పాఠాలు నేర్పిన ప్రయాణం :

మరునాడు మా యాత్రను ఖరారు చేసుకున్నాం. ఈ యాత్రలో మా ప్రమేయం, ఉత్సాహం కొంతమేర కొరవడినాయని ప్రొఫెసర్ గారు మమ్మల్ని సున్నితంగా మందలించారు. ఆరోజు సాయంత్రంలోగా మూడు విషయాల మీద మా స్పందన తెలియజేయాలని కోరారు. అవి కుట్ర, ప్రయోజనం, ఉత్తేజితం. మధ్యాహ్నం నడిచి వెళ్ళేటపుడు ప్రొఫెసర్ గుప్త గారిని ఈ నడక ప్రయోజనం ఏమిటీ అని అడగగా, ఈ నడకే మన కుట్ర, కుతంత్రాలను తీసేస్తుంది అని జోక్ వేశారు. ఈ నడక అనేది మనలోని వాస్తవికతకు, ప్రామాణికతకు మధ్య అనుసంధాన కర్తగా పని చేస్తుంది అన్నారు ప్రొఫెసర్. మనం పల్లెకు ఏదేని వాహనాల మీద వచ్చినట్లయితే నడక ద్వారా వచ్చినపుడు మనకు యిచ్చేంతటి గౌరవ మర్యాదలు వుండవు.

మేము 'పెద్ద బయలు' చేరుకుని ఎంతో ఉత్సుకతతో ఎదురు చూస్తున్న కొన్ని కుటుంబాలను ఇంటర్వ్యూ చేశాం. తెలుగు రాని వాళ్ళకు మాలో తెలుగు వచ్చిన కొందరితో జతచేసి సమావేశం కొరకు ప్రక్కనే వున్న చెట్టుక్రింద సమావేశమయ్యాం. ప్రొఫెసర్ గుప్తా గారు మాట్లాడుతూ తమ జ్ఞానాన్ని భద్రపరచి రాబోయే తరాలకు అందించాలి అని గ్రామస్తులను కోరారు. కాలగమనంలో కనుమరుగైన వివిధ రకాల ధాన్యాల గురించి రాబోయే తరాలకు తెలియజేయ వలసిన బాధ్యత పెద్దలపై వుందని, దీనికోసం మన విజ్ఞాన భాండాగారాలను ఏర్పాటు చేసుకోవలసిన అవసరం వుందని పేర్కొన్నారు. క్రొత్తరకం 'పొయ్యి' ని కనిపెట్టిన జ్యోతిని సన్మానించి, ప్రక్క ఊరికి బయలుదేరాం. కామేశ్వరి, నేను, ప్రొఫెసర్ గుప్తా గారితో నడవ సాగాం. యాత్రలో మా అనుభవాలను గూర్చి అడిగారు.



ఈ యాత్ర మాకు కష్టాలకు ఎదురొడ్డి ఎలా జీవనం సాగించాలి, వివిధ నిబంధనల మధ్య ఎలా మసలుకోవాలి అనే అంశాలను బోధిస్తోందని మా శారీరక సామర్థ్యం, దారుఢ్యం తెలుసుకొని మేమే ఆశ్చర్యపోతున్నాం అన్నాం. అంతే కాక మనకు ప్రతిదీ ఎంత అర్థ రహితంగా ప్రాముఖ్యం లేనిదానిలా అనిపిస్తుందో కూడా బోధిస్తోంది అన్నారు ప్రొఫెసర్ గారు. ఉదా హరణకు మనం మన వాళ్ళకు దూరంగా ఉండలేము అనుకుం



టాం కానీ, చూడండి వారం రోజులుగా మనం మన వాళ్ళకు దూరంగా ఆనందంగా గడుపుతున్నాం. ఈ స్వచ్ఛంద ఇబ్బందులు బాధలు అనేవి సాధారణమేమీ కాదు. స్వచ్ఛందంగా, తీర్థయాత్రలు ఉపవాసాల రూపంలో పాటించేవే.

మరో రెండు రోజులు ఫిలిప్స్, ఎల్సా మాతోనే వుండి అన్ని కార్యక్రమాలు చిత్రీకరణ చేసేవారు. ప్రక్క గ్రామానికి వెళ్ళేప్పుడు దారిలో ప్రొఫెసర్ గుప్తాగారు మాటలు చిత్రీకరించారు. నడిచేటప్పుడు గుట్టలు ఎక్కేటప్పుడు కదలకుండ కెమెరాను తన కుడి భుజంమీద తిన్నగా పెట్టుకుని చిత్రీకరించే సామర్థ్యం గల ఎల్సా, ఫిలిప్స్ ఎప్పుడూ చిరునవ్వుతో వుండేవారు. అప్పుడు ప్రొఫెసర్ గుప్తా అంటారు. 'అవును సృష్టి మూలల్లో వున్న విజ్ఞాన దర్శనానికై వెదుకుతూ వెళ్ళే యాత్రికులమే మేము. గుప్త గారు అన్నది అన్నట్లుగా చెప్పలేను కాని, మొత్తం మీద వారిచ్చిన సమా ధానానికి, హిందీ, ఇంగ్లీషు భాషలలో వారికున్న వాక్చాతు ర్యానికి ముగ్ధురాలి నయ్యాను. నన్ను కట్టి పడేసిన మరొక విష యం గ్రామాలలో వారు హిందీలో మాట్లాడటం. భాషకు హద్దులు లేవు అన్నట్లు అనర్గళంగా ప్రొఫెసర్ హిందీలో మాట్లాడిన ప్రతి పదాన్ని వారు అర్థం చేసుకున్నారు. అవసరమైన దగ్గర బ్రిగేడియర్ గణేశం, మాతోపాటు వుండే చిట్టిబాబు తెలుగులోకి అనువదించేవారు.

అనంతరం ప్రక్కనే వున్న పులుసు మామిడి గ్రామాన్ని చేరుకొని మధ్యాహ్నం భోజనం ముగించు కొని అక్కడ సమావేశ మయ్యాం. పిల్లలకు బయో డైవర్సిటీ పోటీ లు నిర్వహించాం. పిల్లలను 5 రకాల ఆకులు తెమ్మని, వాటి పేర్లు, ఉపయోగాలు వ్రాయమన్నాం. ఈ పోటీలో శోధయాత్రీ కులను కూడా పాల్గొన మన్నాం. ఆశ్చర్య మేమిటంటే కనీసం పేరు కూడా తెల్సిన (ఉపయోగాలు తెలియ వనుకోండి) 5 ఆకులు మేం సేకరించలేక పోయాం. అదే పిల్లలు రకరకాల ఆకులు, వాటి పేర్లు, వాటి ఉపయోగాలతో గుర్తించి సేకరించగలిగారు. ఎక్కువ ఆకులు సేకరించి గుర్తించిన వారికి బహుమతులు యిచ్చాం. ఇది పట్టణ వాసులకు ఒక గుణపాఠం అయ్యింది.

చీకటి పడుతూ వుండగా 'వలసి' చేరుకున్నాం. ఆ గ్రామం కళాకారులకు ప్రత్యేకించి గాయకులకు నిలయం అని తెలుసుకున్నాము. సమాజంలో ప్రస్తుత విద్యా విధానం, సాంకేతిక పరిజ్ఞానం మనలను ఎలా నాశనం చేస్తాయో అనే దానిమీద పాట పాడాడు. మేము తిరిగిన అన్ని ఊళ్ళకన్నా ఈ ఊరు చక్కని భవనాలతో, పిల్లలు చక్కగా చదువుకొని కొంతవరకు అభివృద్ధి చెందినట్లు కన్పిస్తోంది. వినూత్న ఆలోచనల పోటీ నిర్వహించాం. కొంగ్రొత్త ఆలోచనలతో ముందుకు రావడానికి వారికి కొంత సమయం పట్టింది. అనంతరం కొన్ని వీడియో చిత్రాలు చూపించాం. బహుమ తి ప్రదానం, స్థానిక మూలికా వైద్యుని సన్మా నంతో ఆనాటి కార్యక్ర మం ముగిసింది.

అక్కడికి మూడు కి.మీ. దూరంలో వున్న మా చివరిమజిలీ 'రాళ్ళవలస' కు బాగా చీకటి పడ్డాక చేరుకున్నాం. మేము బాగా అలసిపోయి ఉన్నప్పటికి చీకటిలో ఆ కొండల నడుమ వేలాది మినుగురు పురుగుల మిణుకు మిణుకు మిణుకు కాంతిలో ఆ ప్రయాణం ఒక దివ్యానుభూతిగా మిగిలింది. మేము బాగా ఆకలితో ఉండటంతో రాత్రి భోజనం తరువాత గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వంటల పోటీలు నిర్వహించబడ్డాయి. అలాగే ఒక స్థానిక





మూలికా వైద్యుని సన్మానించాం. తరువాత నిద్రకు ఉపక్రమించాం.


మా లగేజంతా సర్దుకొని బయలు దేరటానికి సిద్ధమై, అల్పాహారం తీసుకుంటూ ఉండగా, ఒక వ్యక్తి విచిత్రమైన అలంకారాలతో కర్ర ఊపుకుంటూ మమ్ము లను చూచి అరుస్తూ లోపలికి వచ్చాడు. జీవితంలో ఒకే ఒక్క మజిలీ ఉందని అది భగవంతుని వద్దకు చేరడమని. మన గ్రామం లోగాని, ఈ భూమిమీద గాని, ఈ చెట్లు పుట్టలలో, కొండ కోనలలో దీనిని ఆపే అధికారం ఎవరకీ లేదు అని అన్నాడు. బహుశ అతను తాగిన మైకంలో అలా మాట్లాడుతున్నాడు అని భావించి ప్రొఫెసర్ గుప్త, బ్రిగేడియర్ గణేశం అతనిని మాట్లాడ వద్దని వారించారు. వెంటనే బహుశ అతను మానసికంగా ఉద్వేగానికి లోనవుతు న్నాడేమో అనుకున్నాం. తరువాత తెలిసింది. గతంలో అతను 'సమత'లో చురుకైన కార్యకర్త అని తెలుసుకున్నాం. మా సమావేశం కొనసాగించి వినూత్న సూచన పోటీలు మాలో మేము పెట్టుకున్నాము. మాలో ప్రతి ఒక్కరిని 3 సూచనలతో ముందుకు రమ్మన్నారు. అయితే అవి గతంలో ఎప్పుడూ కననిది, విననిదిగా ఉండాలి. ఒకటి ఉన్న పరికరం యొక్క ఉపయోగాన్ని పెంచేది. మరొకటి ఉన్న ఐడియాను మార్పు చేయడం. ఒకరు ఒక క్రొత్త సూచన మొదలు పెట్టిన తరువాత మాలో ఒక్కొక్కరికి బుర్రలో సరికొత్త ఆలోచనలు మొదలయ్యాయి.

**వినూత్న అనుభూతి :**

ఇది మా శోధయాత్రలో 3వ రోజు, అత్యంత క్లిష్టతరమైన రోజు. ఒక కొండబాటలో రెండు గ్రామాలకు వెళ్ళాలి. వాటిలో ఒకటి సముద్ర మట్టానికి 1,000 అడుగుల ఎత్తులో వుంది. ఆ ఎత్తుకు కారు వెళ్ళలేనందున మా అమ్మ, కొందరు కార్యకర్తలు, వంటవాళ్ళు కారులో వెళ్ళారు. కొందరం బండిలో వెళ్ళాం. దారిలో ఉన్న పచ్చదనాన్ని, కొండలను గుట్టలను జలపాతాలను ప్రకృతిలోని పూర్తి అందాన్ని ఆస్వాదించమన్నారు బ్రిగేడియర్ గారు. అలాగే అందరు ఈ బాటపై ప్రయాణం చేసేప్పుడు ఒకరికి మరొకరు చేదోడు వాదోడుగా సాగాలని అన్నారు. నేను ఇష్పాక్‌తో కలసి ప్రయాణం సాగించా. అతను మనం మాట్లాడిస్తేగాని మాట్లాడడు. అతను ఒక ప్రమాద రహిత వాహనానికి రూపకల్పన చేస్తున్నాడు. ఫిలిప్ మరియు ఎల్సా కూడా మాతో కలిశారు. తమ సరంజామ క్రింది నుంచి పైకి తామే మోసుకుని వెళ్ళారు. స్వల్ప విరామ సమయంలో మేమంతా ఒక చెట్టు క్రింద సమావేశం అయ్యాం. మాలో కొంతమంది మనం ఈ శోధయాత్రకు ఎందుకు వచ్చామో అనే విషయం పై మాట్లాడాం.

పది కి.మీ. ప్రయాణించి మేము మొదటి మజిలి మజ్జివలస చేరుకుని, కామేశ్వరి, వివేక్ ఇష్పాక్, నేను మిగతా వారికోసం ఎదురు చూస్తున్నాం. వాళ్ళు అప్పటికే దగ్గరి దారిలో అక్కడికి చేరుకున్నారు. ప్రొఫెసర్ గుప్త ఒక చెట్టుకు ఆనుకుని విశ్రాంతి తీసుకుం టున్నారు. అతను వెన్ను నొప్పితో, పాదాలపై బొబ్బలతో బాధపడతాడే కాని, నివారణ మందులు వాడరు. పాదరక్షలు మార్చరు. అవిశ్రాంత మూలికా వైద్యులు, పరిచయకర్త వివేక్ ఇతర యాత్రికులు రామకృష్ణ, శ్రీనివాస్, నేను అనువాదకులుగా కార్యక్రమానికి ఉపక్రమించాము. మేము ఇంటర్‌వ్యూ చేయాలనుకున్న మూలికా వైద్యుడు త్రాగుడుకు బానిస కావడంతో అతని నుండి సరైన సమాధానాలు రాబట్టడానికి కొంత సమయం పట్టింది. పోస్టర్లను గూర్చి వివరించడంతో మా సమావేశం మొదలయ్యింది. వారిలో చక్కని జ్ఞాని, అనుభవ పరురాలు, అనర్గళంగా మాట్లాడగలిగిన ఒక మహిళను తమ గ్రామం గురించి, అక్కడి జీవన విధానం గూర్చి, సాంప్రదాయాలను సరిదిద్దటం గూర్చి, ఆహారపు అలవాట్లను గూర్చి మాట్లాడమన్నాము. ఇద్దరు మూలికా వైద్యులతో సహా ఆవిడను కూడా సన్మానించాం. అందులో ఒకరు మేము ఇంటర్‌వ్యూ చేసిన వ్యక్తి ఒకరు కాగా, మరొకరు గుప్తా గారి వెన్ను నొప్పి నివారణకు కొన్ని ఆకులను తెచ్చి ఉపయోగించిన వాడు. ఈ సమావేశంలో గుప్తాగారు మాట్లాడుతూ దెయ్యాలు, భూతాలు అనే అతీంద్రియ శక్తులను మేముకూడా నమ్మమని, అలాగే యుక్తాయుక్త విచక్షణ లేకుండా తాగేవారన్నా అంగీకరించమని గ్రామస్తులు తెలియజేశారు. పనస పండ్లు మొదలగు వాటితో గ్రామస్థులు ఆప్యాయంగా అందించిన ఆతిథ్యాన్ని మధ్యాహ్న భోజనంగా స్వీకరించాం. పనస పండు పట్ల మా ఇష్టతను చూచి మరొక పండు కోసి మాతో తీసుకు వెళ్ళడానికి ఇచ్చారు. ఎప్పటిలాగే గౌతమ్ తన సంచిలో లగేజి నింపాడు.

ఈ కొండలమీదికి ప్రయాణిస్తున్న ప్పుడు మాకు కల్గిన దివ్యానుభూతి మాటలతో చెప్పేది కాదు. పైకి పోయేకొద్దీ ప్రకృతి సౌందర్యాలు, ఎర్రని గుట్టలు వాటికి వెండి, బంగారు రంగులో కన్పించే నీడలు, మమ్ములను





మంత్రముగ్ధులను చేశాయి. మాకు ఊపిరి తీసుకోవడం కొంత కష్టంగా ఉన్నప్పటికి ఎత్తయిన కొండలు ఎక్కడం మాకెంతో ఆనందం అన్పించింది. మేము యువకులం, శ్వాస తీసుకోవడంలో కొంత ఇబ్బంది పడుతున్నప్పటికి ఎలాంటి అలసట తీసుకోకుండా వడివడిగా పైకి ఎక్కుతున్న కామేశ్వరిని చూస్తే నాకు ఒకింత ఆశ్చర్యం అన్పించింది. మేమైతే రెండుసార్లు కాసేపు ఆగాల్సి వచ్చింది. ఎవరు ఎక్కువసేపు 'ఓం' కారం చేస్తారన్న పోటీ పెట్టుకున్నాం. గత 20 సంవత్సరాలుగా శారీరక శ్రమ చేస్తున్న 70 సంవత్సరాల గుజరాత్‌కు చెందిన వల్లభ భాయ్ ఈ పందెంలో గెలిచారు. నన్ను, కోయిల్‌ను, సులేఖను తలా ఒక పాట పాడమని కోరారు గుప్తాగారు. అతి కష్టంమీద 'బూర్జ' చేరుకున్నాం.

కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత ముందు రోజు మేము పడిన శ్రమలో ఇది సగం కూడా లేదు అనిపించింది. సాయంత్రం వరకు మా శోధయాత్ర కొనసాగింది. ఆ రాత్రి మేము ఒక చర్చిలో సేద తీరాం. మణి అనే ఒక ఆవిడ మాకు అవసరమైన సహాయ సహకారాలు అందించింది. సమీపంలోని ఒక బావి వద్ద మేము స్నానాదికాలు ముగించి తయారై రాత్రి భోజనం చేసి గ్రామసభకు వెళ్ళాం. వీడియో చిత్ర ప్రదర్శన, వంటల పోటీ మొదలగు వాటితో సమావేశం పూర్తి అయిన తరువాత గ్రామస్తులు ఆ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన థింసా జానపద నృత్యం ప్రదర్శించారు. ఈ నృత్యం ఒకరి చేతులు మరొకరు ఒక గొలుసు రూపంలో పట్టుకొని అతి వేగంగా గుండ్రంగా తిరుగుతూ చూడముచ్చటగా వుంటుంది. మహిళలంతా ఒక చివర నాట్యం చేస్తుండగా, పురుషులంతా మరో చివర గుమికూడుతారు. వాళ్ళు ఒక లయబద్ధంగా కదులుతూ వుంటే, సమూహం క్రమేపి పెద్దగా అవుతూ కొత్తవాళ్ళు మధ్యలో చేరుతూ వుంటారు. రెండు చివరల ఇద్దరు నాయకులు వుంటారు. వారు అప్పుడప్పుడు లయబద్ధంగా అడుగులు మారుస్తూ ఒక నిర్దిష్ట ఆకారంలో తిరుగుతూ నృత్యం చేస్తూ మమ్మల్నందరిని ప్రోత్సహించే వారు.

బూర్జా నుండి క్రిందికి 3 కి.మీ. నడచిన తరువాత మేము బర్రింగ్‌బందర్ అనే గ్రామాన్ని చేరుకున్నాం. బయోడైవర్సిటీ పోటీలలో పిల్లలందరూ అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్దలు కొందరు మొక్కలను గుర్తించడంలో పిల్లలకు సహకరించారు. ప్రొఫెసర్ గుప్త దీనిని అభివర్ణిస్తూ పెద్ద తరానికి, యువ తరానికి సాంప్రదాయక విజ్ఞానంతో ఉన్న ఖాళీని పూడుస్తుంది అని అన్నారు. అక్కడి పిల్లలతో తగినంత సమయం గడిపిన మేము బయలుదేరుతున్న సమయంలో కొందరు మహిళలు పళ్ళాలతో పసుపు కలిపిన బియ్యం, సంపెంగ మాలలతో వచ్చారు. మమ్మలను సువాసనలు వెదజల్లే పూల మాలలతో సత్కరించారు. తరువాత బయలుదేరి ఎండలో సుమారు 7 కి.మీ. నడచిన తరువాత కిండంగి గూడ గ్రామం చేరుకున్నాం.



మధ్యాహ్న భోజనం తరువాత శోధయాత్రలో నా అనుభవాలను గూర్చి ఇంటర్‌వ్యూ చేస్తానని ఫిలిప్స్ అన్నాడు. నల్లని మేఘాలు కమ్ముకొంటూ వుండగా నా ఇంటర్‌వ్యూ పూర్తి చేసుకొని సమావేశానికై హాజరై ఆనాటి చివరి మజిలీ 'చొంపి'కి బయలుదేరాం. మేము మార్గమధ్యలో ఒక కుగ్రామంలో చిన్న సమావేశానికి ఆగి 10 కి.మీ. దూరంలోని చొంపికి చేరుకునేటప్పటికి మా అమ్మ అక్కడ మమ్ములను కలుసుకుంది. మా సెల్‌ఫోన్లు అన్నీ





చొంపికి పోయే దారిలో పని చేయటం మొదలు పెట్టాయి. రాజేశ్వర రావు గారి సహకారంతో చాలా రోజుల తర్వాత ఆరాత్రి మా నాన్నగారితో మాట్లాడాం. బాగా చీకటి పడ్డది, మిణుగురు పురుగుల వెలుగులో మా ప్రయాణం మరింత ఆహ్లాద కరంగా మరపురాని మధురాను భూతిగా మిగిలింది. నేను చివరి గుంపులో మా అమ్మ, కామేశ్వరి, బ్రిగేడియర్, స్థానిక వాలంటీర్ వసంత కుమార్, రామకృష్ణ, అరుల్‌తో కలిసి నడవ సాగాను. అరుల్ చాలా రోజులుగా కాళ్ళకు పాదరక్షలు లేకుండా తన యాత్ర కొనసాగిం చాడు. దారిలో బ్రిగేడియర్, నేను ఆదివాసి వసంత్ కుమార్‌ను ఇక్కడి గిరిజన జాతులలో సాంప్రదాయ వివాహం ఎలా వుంటుంది అని అడిగా. ఆయన చెప్పింది విని ఆశ్చర్యపోయాం. అక్కడి వివాహ వ్యవస్థలో సాంప్రదాయబద్ధంగా అబ్బాయి, అమ్మాయికి కట్నం యిస్తాడు. ఒకవేళ భర్త ఇంట్లో అమ్మాయి చనిపోతే ఆస్తి మొత్తం ఆడపిల్ల తల్లిదండ్రుల పేరుమీదకి బదలాయి స్తారు. అక్కడక్కడ స్వల్ప మజిలీలతో అనేక విషయాలు తెలుసుకుంటూ చొంపిలోని విశాల మైన ప్రదేశానికి చేరుకున్నాం.

ఇక్కడ ఒక దగ్గరే మహిళలకు వేరుగా గది కేటాయించారు. అందరం తయారై ఫిలిప్స్, ఎల్సా ఇంకా మాతో కలసిన కొందరు సమత కార్యకర్తలకు వీడ్కోలు చెప్పాం. గ్రామ సభ కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు కావడంతో వివేక్ వారికి వీడియో చిత్రం చూపించి, కార్యక్రమం ముగించాం. ఆ రాత్రి ఇప్పటి వరకు ఎన్ని కిలోమీటర్లు నడిచాం, రాబోయే రోజులలో ఇంకా ఎన్ని కిలో మీటర్లు నడవాలి అనేది లెక్కలు వేసుకుంటూ పడుకున్నాను. వివేక్ అన్న తరువాత నేను ఆలోచించా. నిజమైన యాత్ర అనుభూతిని నేను పొందలేదు. నా ధ్యాస అంతా నడక మీదే వుండేది. మరుసటి రోజు సమావేశంలో ప్రొఫెసర్ గుప్త ఇంకా మేము ఒకటిగా వుండి చేయగల్గినంత చేయాలి అన్నప్పుడు నేను చెప్పింది నిజమనిపించింది. ఆ తరువాత ఒక బ్యానర్‌తో ప్రతి గ్రామం తరిగి సాధ్యమైనంత ఎక్కువ మందిని కలవాలి అని మేము నిర్ణయించుకున్నాం.

**మరింత ఉత్సాహం, పట్టుదల (నా అనుభవం) :**

మా శోధయాత్రలో 5వ రోజు మజిలీ కొత్తవలస. అక్కడ బయోడైవర్సిటీ పోటీలు నిర్వహించాం. అక్కడ కొందరు మహిళలతో మాట్లాడాం. వారి ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడినప్పుడు, వారు మాకోసం రాగులతో తయారు చేసిన పులిసన అంబలిని తీసుకు వచ్చారు. చాలా రుచిగా వుంది. జున్నులాగ వుంది. పరస్పరం మాటలు అయిన తరువాత అక్కడి పిల్లలకు బహుమతులు ఇచ్చాం. మేము వారినుండి విడిపోతున్న సందర్భంగా అక్కడి మహిళలు మాకు కొన్ని బొప్పాయి పండ్లు కానుకగా తెచ్చి ఇచ్చారు. పరస్పరం మేము చర్చించుకోవడం మూలంగా అభిమానాలు ఆప్యాయతలు, అనుబంధాలు ఎంతగా బలపడతాయో మేము రెండవసారి అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం. దురదృష్ట వశాత్తు ప్రక్క గ్రామంలో సంత నిర్వహిస్తూ వున్నందున ఎక్కువ మంది గ్రామస్తులు హాజరు కాలేక పోయారు. తరువాత కొంత దూరం నడచి వెళ్ళి కోడిపుంజు వలస గ్రామం చేరుకున్నాం. అక్కడ ముందుగా చెక్ డ్యామ్‌తో కన్పించే ప్రకృతిసిద్ధమైన ఒక వనంలాంటి దాన్ని సందర్శించాం. చెక్‌డ్యాం చుట్టుకొని వర్షపునీటిని సమర్థవంతంగా ఎలా ఉపయోగించవచ్చు అనేదాని గూర్చి ప్రొఫెసర్ గుప్త వివరించారు. బయలుదేరేముందు అక్కడ ఒక చెట్టు చూచి గుప్తా గారితో అన్నాను. ఆ చెట్టు చనిపోయిన తరువాత దానిమీద చెదలు చూడమని. దానికి గుప్తా మాట్లాడుతూ చెట్టు చనిపోలేదని, వాస్తవానికి ఆ చెదలే చెట్టును బ్రతికిస్తున్నాయని పేర్కొన్నారు. అంతే కాకుండా మరణానంతరం కూడా ఒకరి హృదయంలో చిరస్థాయిగా ఉండటం అంటే ప్రత్యేకతేనని అన్నారు. ఈ సందర్భంగా హిందీలో ఒక ఆశుకవిత్వం వెంటనే వ్రాసుకున్నారు. ఐ.ఐ.ఎమ్. నుండి వేదాంత పరంగా, కవిత్వపరంగా, నైపుణ్యం, సూక్ష్మ బుద్ధితో రెండు వైపుల పదునున్న కత్తిలాంటి ప్రొఫెసర్ గారి పరిచయానికి, సాన్నిహిత్యానికి ఆశ్చర్యపో యాము. మేము చెక్ డ్యామ్ చూస్తుండగా, శోధయాత్రీకులు అక్కడి గ్రామస్తులతో వాలీబాల్ ఆడసాగారు. ఇంతలో అందరిని గ్రామ సభకు పిలిచారు. ఆ సభలో రామంకి భాయ్ ఆ గ్రామంలో తాను చూసిన ఒక మొక్క గురించి వివరించారు. 'జాంప్రా' అని పిలువబడే ఈ చెట్టు కాయలు ప్రకృతి సిద్ధమైన రంగుగా అద్దకం పరిశ్రమలో ఉపయోగ పడుతుంది. స్థానికంగా లభ్యమయ్యే ఈ గింజలు మొక్కలను అలాగే అమ్మేకన్న వాటిని ఉపయోగ కర వస్తువులుగా తయారు చేసి అమ్మటంలో గల విశిష్టతను ఆ గ్రామస్తులకు వివరించడంతో సమావేశం మొదలయింది. మొక్కల పరిశోధన లకు సంబంధించిన పోటీ నిర్వహించాం. ఈ పోటీలో జ్యోతి అనే అమ్మాయి సుమారు 25 రకాల మొక్కలు సేకరించి, వాటి పేర్లు, ఉపయోగాలు చెప్పడం, వాటిని విని మేము ఆశ్చర్య పోయాం. పిల్లలకు బహుమతులు ఇచ్చి, అక్కడి మూలికా వైద్యుని సన్మానించి, అలాగే మా ఈ కార్యక్రమంలో అత్యంత చురుకుగా పాల్గొన్న మహిళలను సన్మానించాం. అనంతరం పరిపూర్ణమైన విందు భోజనం సంతుష్టిగా ఆరగించాం.

ప్రక్కన సిర్గం గ్రామానికి వెళ్ళేటప్పటికి మాకు కొద్దిమంది గుంపు ఎదురయ్యింది. కాని వారినుంచి మంచి స్పందన వచ్చింది అక్కడి వారికి 'హనీబీ' కార్యకలాపాల గూర్చి వివరించి, వారికి మా సేవలు ఎప్పుడూ వుంటాయని తెలియజేసి, మా జ్ఞాపకాలతో మిగిలి పోయేట్లుగా 'గ్రామీణ జ్ఞాన రిజిష్టర్లు' వారికి ఇచ్చాం. ఆ తర్వాత సమీపంలోవున్న గ్రామం 'వర్ర' చేరుకున్నాం. సమావేశ స్థలానికి చేరుకోగానే



జీవితంలో మరచిపోలేని దృశ్యం కనిపించింది. ఇద్దరు మూలికా వైద్యులు తప్పతాగి రాళ్ళు విసురుకుంటూ, అరుచుకుంటూ తగవులాడటం కంట పడింది. జయ్‌దీప్ కాలికి బాగా దెబ్బ తగిలింది. మేము ఆ గ్రామంలో సభ రద్దు చేసుకుని ముందుకు సాగాం. ప్రకృతి సోయగాలను తిలకిస్తూ మధ్య మధ్యలో ఆగి ప్రొఫెసర్ గుప్త రైతులతో సంభాషిస్తూ సుమారు మూడు కి.మీ. దూరం నడిచి ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన 'దుంబ్రిగూడ జలపాతం' దాటి దుంబ్రిగూడ గ్రామం చేరుకున్నాం. ఫోను సౌకర్యం, చక్కని భవంతులతో ఉన్న ఆ గ్రామాన్ని చూచి నేను, కామేశ్వరి మరుసటి రోజు మాకు చాలా ఆహ్లాదంగా గడుస్తుంది అనుకున్నాం. అక్కడ టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నప్పటికి అమ్మకు, నాకు ఆరోజుకాని, మరుసటి రోజుకాని కనీసం ఇంటికి ఫోన్ చేద్దామన్న ధ్యాసకూడా కలుగలేదు. జీవన గమనంలో ఈ బంధాలు, అనుబంధాలు అంటీ ముట్టనట్లుగా వుండాలి అనే స్థితికి చేరుకున్నాం.

రాత్రి భోజనం ముగించుకొని, సమావేశ స్థలానికి వెళ్ళాం. ఇంకా కొందరు గ్రామస్తులు రావలసి వుండటంతో, సంగీతం పట్ల అభిరుచి కల్గిన గుప్త గారు 'కొయలు'ను ఒక పాట పాడమన్నారు. నేను, అమ్మకూడా గొంతు కలిపాం. వెను కనుండి రామకృష్ణ మరి కొందరు మిత్రులు కోరస్ అందుకున్నారు. ఇంతలో కుంభ వర్షం మొదలైంది. సభ ప్రారంభించలేదు. వాన తగ్గే వరకు మేము అలాగే పాడుతున్నాం. అక్కడి నుండి బసచేసే చోటికి చేరుకున్నాం. మరుసటి రోజు వినీత్, ఉదయ్, నదీమ్ వెళ్ళిపోతున్నందున రాత్రి పొద్దుపోయే వరకు మా సమావేశం యొక్క ప్రతిస్పందన గూర్చి కూలంకషంగా చర్చించాం. అలాగే నక్సలైట్ బంద్ మూలంగా జూన్ 8 బదులు, జూన్ 7 సాయంత్రమే మేముకూడా బయలు దేరాలని నిర్ణయించుకున్నాం.


**యాత్ర చివరి రోజు :**


మేము తయారై వినీత్, ఉదయ్, నదీమ్ లకు వీడ్కోలు పలికి, పత్రికా విలేకరుల సమావేశం కొరకు వేచి చూచి సమావేశం ముగించాం. అనంతరం రెండు కాల్వలు దాటి, సుమారు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి 'పనసపట్టు' గ్రామం చేరుకున్నాం. అక్కడ రెండు పనస చెట్ల క్రింద సభా ప్రాంగణం ముందుగా ఆ గ్రామ పెద్దను మాట్లాడమన్నాం. మేము వివిధ గ్రామాలలో గమనించినట్లుగానే ఇక్కడ కూడా గ్రామంలో వారు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య గురించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం గురించి మాట్లాడారు. గుప్త గారు మాట్లాడుతూ ఈ సమస్యల విషయంలో తాము ఎలాంటి పరిష్కారం చేయలేమని, కాకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తామని హామీ ఇచ్చారు. ఎక్కువ డబ్బు సంపాదించే వివిధ మార్గాలను చూపగలమని సాంప్రదాయక విజ్ఞానానికి విస్తృత ప్రచారం మాత్రం ఇవ్వగలమని పేర్కొన్నారు. తమ ప్రాంతంలో విస్తారంగా వున్న వన సంపద నుండి వివిధ రకాల వస్తువులు, మందులు, మూలికలు మొదలైనవి



తయారు చేసి విక్రయించి తద్వారా ధనార్జన చేయవచ్చునని సూచించారు. అనంతరం మొక్కల పరిశోధనలకు సంబంధించి పోటీలు వివిధ కార్యక్రమాలు నిర్వహించాం. అలాగే మానవ ప్రమేయం లేకుండానే పెరిగే వివిధ ఔషధ మొక్కలు వాటి ప్రయోజనాలను గూర్చి అక్కడి మహిళలతో చర్చించాం. సూరజ్ అనే వ్యక్తి మహిళా చర్చలో మాతో సహకరించాడు. అనంతరం అక్కడి ఇసుకతో క్షణాలలో ఒక అందమైన తాబేలును చేసి చూపాడు. వివిధ రకాల కార్యక్రమాలతో ఈ గ్రామసభ అధ్యంతం ఉత్సాహంగా సాగింది. అక్కడి మూలికా వైద్యుని సన్మానించి, పిల్లలకు, ఇతరులకు బహుమతి ప్రదానం చేసి ప్రక్క గ్రామానికి బయలుదేరాం.

ఎర్రటి ఎండలో సుమారు 3 కి.మీ.





నడిచిన తరువాత ఉయ్యాలగూడ గ్రామం చేరాం. అక్కడ మధ్యాహ్నం భోజనం కానిచ్చి, ఇన్ని రోజులు మాకు రుచికరమైన భోజనం వండి వడ్డించిన వంట వాళ్ళకు ధన్యవాదాలు తెల్పుకొని మా చివరి మజిలీ అయిన 'టిటింగ్ వలస'కు బయలుదేరాం. తగినంత వ్యవధి లేని కారణంగా సుమారు 10 కి.మీ. దూరం నడిచి మా చివరి మజిలీ చేరుకున్నాం. అప్పటికే కొందరు గ్రామస్తులు అక్కడి సమావేశానికి హాజరై వున్నారు. మేము అక్కడ అడుగు పెట్టేటప్పటికి వర్షం మొదలైంది. వెంటనే సమావేశం మొదలైంది. కొంతమంది యాత్రీకులు మనం వానలో నడవలేక పోయామే అని విచారించినా, నేను మాత్రం 3 రోజుల నుంచి ఎండ వానలు దోబూచు లాడుతూ మా యాత్ర ముగింపు సమయా నికి భారీ వర్షం పడటంతో సంతోషిం చాను. చిన్న సమావేశం తర్వాత కాసేపు ఆనంద డోలిక లలో తేలియాడి, అయిదు గంటల ప్రయాణంతో వైజాగ్ చేరుకోవడానికి వాహనంలో ఎక్కాం. వెనక సీట్లలో వాళ్ళు కాసేపు పాటలు పాడా రు. ఆ పిమ్మట మేమంతా నిద్రలోకి జారుకు నేంత వరకు అంత్యాక్షరి ఆడుకున్నాం. ప్రయాణ బడలికతో మేము వైజాగ్ చేరుకునే సరికి ఇంకా భోజనం తయారు కాలేదు. చాలా రోజుల తర్వాత వైజాగ్‌లో ఒక చక్కని అధునాతన స్నానాలగదిని చూశాం. రాత్రి భోజనం ముగించుకుని చాలా రోజుల తర్వాత హాయిగా ఫ్యాను క్రింద ఆదమరచి నిద్రపోయాము.

**సింహావలోకనం :**

శోధయాత్ర పై ప్రతిస్పందన తెలియ జేయటానికి సమావేశం మరుసటి రోజు ఉదయం అల్పాహారం తరువాత మొదలైంది. మా సూచనలను, సలహాలను తెల్పుతూ మా ఊహకు అనుగుణంగా యాత్ర సాగిందా అని అడిగారు. అనూహ్యంగా మేము పొందిన అనుభవాలు, అలాగే హనీబీ కార్యక్ర మాలకు మేము ఏ విధంగా తోడ్పడగలం అనే దాన్ని గూర్చి తెలి యజేయ మన్నారు. వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వివిధ వ్యాపకాల వ్యక్తులను కలవడం వల్ల విశేష అనుభవం గడించా లని అన్నారు. నా మట్టుకు నాకు ఈ శోధయాత్ర మూలంగా చాలా అనుభవం చేకూరింది. అలాగే పనికిరాని నా ఆలోచనలకు అడ్డుకట్ట ఏర్పడింది. తాను ముస్లిం అయినప్పటికీ ఎలాంటి కులమత భేదాలు లేకుండా అందరూ ఒకరికొకరు సాయంగా గడిపామని ముందురోజు నదీమ్ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. అసలు ఈ నడకను నడవ వలసిన దూరాలను తలచుకుంటే ఎప్పటికప్పుడు ఈ యాత్రను మనం ఇష్ట పూర్వకంగా కొనసాగించ గలమా అని నేను, వనిత అనుకునే వాళ్ళం. కాని ఎప్పుడూ యాత్ర ఆగలేదు. శోధయాత్ర గురించి ఎంత చదివి ఉన్నప్పటికి ప్రస్తుతం ఈ యాత్రను గురించి తెలుసుకోవదానికే సమయమంతా సరిపోయింది. నిజంగా అవసరంలో వున్న వాళ్ళను ఆదుకోవాలన్నా, అపార జ్ఞాన సంపద అందిపుచ్చు కోవాలన్న ఈ యాత్ర సంపూర్ణ ఫలితాన్ని ఆస్వాదించాలన్నా ఇలాంటి యాత్ర మరొకసారి చేయాలి అన్నాను. అలాగే కొందరు గుజరాత్‌కు చెందిన యాత్రీకులు మాట్లాడుతూ వివిధ మూలికా వైద్యుల గూర్చి తెలుసుకున్నా మని, నడిచి వచ్చి ఉండకపోతే రకరకాల మూలికా సంబంధమైన మొక్కలను చూసి వుండేవాళ్ళం కాదని అన్నారు.

యాత్ర ప్రతిఒక్కరిలో ఒక సరికొత్త ఆలోచనలకు బీజం నాటింది అనడంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. ప్రొఫెసర్ గుప్త, బ్రిగేడియర్ గణేశం, ఇతర వాలంటీర్లకు బరువెక్కిన హృదయంతో వీడ్కోలు పలికి మా ఇంటికి తిరుగు ప్రయాణానికి బయల్దేరాము.

**సంపాదక వర్గం కుమారి వాణి రూపేలా గారికి మనసారా కృతజ్ఞతలు తెయజేస్తున్నది.**



# ఇతర రాష్ట్రాల పల్లెకబుర్లు



## కోళ్ళఫారం ను తగు ఉష్ణోగ్రతలో ఉంచుట

శ్రీమతి మేరిటిగ్గ కోళ్ళ ఫారాన్ని నిర్వహిస్తోంది. ఈమె జార్ఖండ్ రాష్ట్రంలోని కురిడి గ్రామానికి చెందిన 24 సంవత్సరాల గిరిజన మహిళ. ఆమె 7వతరగతి వరకు చదువుకుంది. ప్రారంభ దశలో ఒక ఎన్‌జిఓ (ప్రదాన్) కొద్దిపాటి మొత్తంలో కోళ్ళఫారం నడపటానికి ఆమెకు తోడ్డద్దారు. సుమారు 500 బ్రాయిలర్ కోళ్ళతో రెండు కోళ్ళ ఫారాలు నిర్వహిస్తోంది. విద్యుత్తు వాడకుండా తక్కువ ఖర్చుతో సమశీతల ఉష్ణోగ్రతను ఏర్పాటు చేసే విధానాన్ని రూపొందించింది. సాధారణ బొగ్గును ఒక పాత్రలో ఉంచి కాల్చడం ద్వారా కోళ్ళ ఫారానికి తగు ఉష్ణోగ్రతను అందించే ఏర్పాటు చేసింది. ఈ విధంగా తయారైన ఉష్ణాన్ని రిఫ్లెక్టర్స్ ద్వారా మొత్తం కోళ్ళ ఫారం వ్యాపించేలా చేసింది.

నాలుగు అడుగుల వ్యాసంతో పైకప్పును వేలాడదీసి, ఒక కప్పు రిఫ్లెక్టర్‌గా పనిచేసేలా కోళ్ళ



ఫారాన్ని ఉష్ణస్థితిలో ఉంచు తుంది.

500 కోళ్ళుగల కోళ్ళఫారంలో రెండు రిఫ్లెక్టర్లు ఉపయోగిస్తోంది.

## 'చింత ఆకు' తో ధాన్యం నిలువ :

జెనివాలోని తాటీ దిస్సాన అనే మహిళ వరి ధాన్యం పండించేది. ఆమె తన విత్తనాలను భద్రపరచుకోవడానికి చింతచెట్టు ఆకును వాడేది. చింత కొమ్మలను విరిచి ధాన్యంపై కప్పి ధాన్యాన్ని బాగా ఎండలో ఆరబెట్టాలి. ధాన్యం బాగా ఎండిన తర్వాత చింత కొమ్మలకున్న చింత ఆకును అదే ధాన్యంలో తెంపి పోయాలి. తర్వాత ధాన్యాన్ని గాదెల్లో నింపి వుంచితే ధాన్యానికి ఎలాంటి పురుగు పట్టదు. ఈ ధాన్యం దాదాపు నాలుగు సంవత్సరాల పాటు అలాగే వుంటుంది. ఈ పద్ధతిని ఎలాంటి ధాన్యానికైనా (వరి, జొన్న, కందులు, అలసందలు, సోయా చిక్కుడు, బఠాని లాంటివి) ఉపయోగించుకోవచ్చు. ఆ దేశంలోని శాస్త్రజ్ఞులు ఈ ప్రయోగం గురించి పరిశోధనలు జరిపి నిజమని తేల్చారు.

## పంట చేలలో ఎర్రచీమల నివారణ :

గునియా అటవీ ప్రాంతంలోని గోపేట గ్రామానికి చెందిన రైతు శ్రీ సోనోము ఒకరోజు తన పొలంలో సామ్ చెట్టు కాయల గుత్తిని కోస్తూ కాఫీ చెట్టుక్రింద వున్న ఒక చిన్న పామ్ మొక్కకు వేలాడుతున్న చెదల పుట్టపై కాలువేసారు. వెంటనే కాఫీ చెట్టునుండి వెలుపలికి వస్తున్న ఎర్రచీమల దండును చూశాడు. ఈ ప్రేరణ మూలంగా కల్గిన ఆత్రుతతో మరొక చెదపుట్టను కదిలించి చూశాడు. ఈ నల్లచీమల దండు మూలంగానే ఎర్రచీమల దండు వలన ప్రయాణం మొదలెట్టాయా అనేది శోధింప జూశాడు. కొద్దిపాటి నల్లచీమల కారణంగానే ఈ ఎర్రచీమలు పారిపోతున్నాయి అన్న వాస్తవాన్ని గుర్తించాడు. ఎర్రచీమలు కాఫీ పంటను నాశనం చేస్తుండటంతో నల్ల చీమలున్న ఆ చెదపుట్టలను ఎర్రచీమలను పారద్రోలటానికి ఉపయోగించ సాగాడు. దీన్ని ఇతర రైతులతో పంచుకున్నాడు. ఈరోజు ఈ పరిశోధనను అనేకమంది రైతులు వాడుతున్నారు.

దక్షిణ గుజరాత్‌లోని థెజ్ గ్రామానికి చెందిన ధీరూభాయ్ దయాల్జీ భాయ్ పాటిల్ చీమలను క్రిమి సంహారకాలుగా ఉపయోగించే వాడు. అతను ఒక అగ్గిపెట్టెలో కొన్ని చీమలను సేకరించి, పొలానికి తెచ్చేవాడు. చీమలను ఆ పొలంలో వదలగానే తీగలపైకి పాకి క్రిములతో పోరాటం ప్రారంభించి క్రిమి వినాశనానికి, తద్వారా పుష్కలమైన పంటకు, ఫలసాయానికి దోహదపడేవి.

## పట్టు పురుగుల ఉత్పత్తి

జలసింగ్ సమద్ అనే 38 సంవత్సరాల రైతు పట్టు ఎక్కువగా ఉత్పత్తి చేసే జార్ఖండ్ రాష్ట్రం లోని కుచైనా ప్రాంతంలోని మారుమూల కుం గ్రామానికి చెందినవాడు. అతని కుటుంబంలోని ఏడుమంది సభ్యులు కూడా పట్టు పురుగుల వ్యవసాయమే జీవనోపాధిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కామర్స్ పట్టభద్రుడైన జలసింగ్ ఎప్పుడూ తన కుటుంబ సభ్యుల జీవితాల్లో వెలుగు నింపాలని, వారి పేదరికాన్ని పారద్రోలాలని కలలు కనేవాడు. కాని, ఈ దిశలో ముందుకు సాగడానికి అతనికి తగిన వనరులు లేవు.

జలసింగ్ సమద్ ఎలాంటి వ్యాధులు సోకని పట్టు పురుగు గుడ్లను తయారు చేసి పరిసర వాసులైన సుమారు 300 మంది రైతులకు అందించే ఒక కుటీర పరిశ్రమను స్థాపించాడు. ఆరు నెలలకు సుమారు 17 నుండి 18 వేల పట్టు పురుగుల గుడ్లను ఉత్పత్తి చేసేవాడు. ఒక్కో పట్టు పురుగు (డి.ఎఫ్.ఎల్.) ను నాలుగు రూపాయ చొప్పున అమ్మేవాడు. ఇతని పట్టు పురుగుల ఉత్పత్తి కేంద్రంలో 17 మంది స్త్రీ, పురుషులు ఉపాధి పొందుతున్నారు. పట్టు పురుగు గుడ్లను సేకరించడానికి సాధారణంగా ప్లాస్టిక్ కప్పులు వాడేవారు. దాని స్థానంలో జలసింగ్ 'సియాలిఫాథర్' అనే ఆకుతో తయారు చేసిన కప్పులను (దొప్పలను) వాడటం ప్రారంభించాడు. ఒక్కో ప్లాస్టిక్ కప్పు ఖరీదు ఆరు రూపాయలు కాగా, ఈ ఆకుతో తయారైన దొన్నెల ఖరీదు కేవలం పదిహేను పైసలు మాత్రమే. ఈ దొన్నెలను సులభంగా రూపొందించవచ్చు. అంతే సులువుగా నాశనం చేయవచ్చు. దాని మూలంగా వాతావరణ కాలుష్యం ద్వారా సంక్రమించే ప్రోటోజోన్ అనే వ్యాధిని నివారించవచ్చు.

## నెల్లూరులో అపూర్వ సంగమం

# గ్రామీణ ఇన్నోవేటర్ల - ఇంజనీరింగ్ విద్యార్థుల సదవగాహన

- కిషన్ పవార్

ఇన్నోవేటర్, వలంటీర్ - హనీబీఎపి

శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఫలాలు మాన్యులతో పాటు సామాన్యులకు కూడా అందినప్పుడే వాటికి నిజమైన సార్థకత లభిస్తుందని చెప్పవచ్చు. ఈ విషయాన్ని నమ్మడమే కాక, ఆచరించి చూపుతోంది గూడూరులోని 'ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల' యాజమాన్యం. ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ నెల్లూరు జిల్లా గూడూరులో 2001వ సంవత్సరంలో ప్రారంభించబడింది. విశ్వ పరిజ్ఞానాన్ని సామాన్యుడికి కూడా అందించి, తద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలనే సదాశయంతో టి.ఇ.పి.పి., డి.యస్.ఐ.ఆర్. న్యూఢిల్లీ వారి సౌజన్యంతో '2వ టెక్నాలజీ డెలివరీ సెంటర్ ఎగ్జిబిషన్'ను 2008 డిసెంబర్ 19, 20 తేదీలలో కళాశాల ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ఎన్.ఐ.ఎఫ్. / హనీబీఎపి ద్వారా వచ్చిన ఇన్నోవేటర్లు తమతమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా బ్రిగేడియర్ పి. గణేశం (చీఫ్ కో-ఆర్డినేటర్, హనీబీఎపి), విశిష్ట అతిథులుగా శ్రీ పి. చంద్రకాంత్ శర్మ (సి.జి.యం. సింగరేణి కాలరీస్ లి.) మరియు జె. దుర్గాప్రసాద్ (ప్రముఖ పారిశ్రామికవేత్త)లు పాల్గొన్నారు. శ్రీ వి. పెంచలయ్య, (ఛైర్మన్), డా. ఎ.వి.యస్. ప్రసాద్, (కళాశాల ప్రిన్సిపాల్), డా. యం.ఆర్. కొడాలి, (ఆర్&డి అసెట్) అతిథులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

ఛైర్మన్ శ్రీ వి. పెంచలయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు సమాజ శ్రేయస్సు కోసం పలు అవగాహనా సదస్సులు, ఎయిడ్స్ ర్యాలీ, సునామీ ఫండ్ కలెక్షన్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించి నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మరియు కొడాలి గారలు కూడా విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. తదుపరి శ్రీ చంద్రకాంత్ శర్మ యస్.సి.ఎ.ఐ. క్లబ్బులను గురించి తెలియజేశారు. ఇంతకుముందు గూడూరు మైకా నిక్షేపాలకు పేరుగాంచిందని, కానీ, ప్రస్తుతం 'ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల' ద్వారా ప్రఖ్యాతిగాంచినట్లు తెలిపారు. పారిశ్రామికవేత్త శ్రీ దుర్గాప్రసాద్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. చివరగా ముఖ్య అతిథి శ్రీ పి. గణేశం తమ స్ఫూర్తిదాయక ప్రసంగంతో విద్యార్థులను ఉత్తేజపరిచారు. యన్.ఐ.ఎఫ్. ఆవిర్భావం ముఖ్య ఉద్దేశ్యం, గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లను గుర్తించి, వెలుగులోకి తీసుకు రావటంలో హనీబీ పాత్ర, యస్‌సిఎఐ క్లబ్‌ల ఆవశ్యకతను గురించి విపులంగా వివరించారు. పల్లెజనులు ఆర్థికంగా పేదవారు కావచ్చేమో కానీ, జ్ఞానధనం పుష్కలంగా వున్నవారు అని చెప్పారు. అట్టి జ్ఞానం విలుప్తం కాకుండా దానిని ఒడిసి పట్టాల్సిన బాధ్యత మీపైనే వుందన్నారు. మీ పెద్దవారితో మాట్లాడటానికి తీరిక సమయాలను కేటాయించండి. వారి అనుభవాలను, జ్ఞానాన్ని ముందు తరాల వారికి అందిద్దాం. యన్.ఐ.ఎఫ్. ద్వైవార్షిక పోటీలకు వీలైనన్ని ఎక్కువ ఎంట్రీలు పంపడంలో మీరు చురుకైన పాత్రను పోషించగలమని నాకు మాట ఇవ్వండి' అని కోరారు. తదుపరి ఎగ్జిబిషన్‌లో పాల్గొనడానికి వచ్చిన గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్‌లను అందరినీ వేదికపైకి పిలిపించి సభకు పరిచయం చెయ్యడం జరిగింది. అనంతరం ప్రొఫెసర్ యన్.వి. సురేంద్రబాబు గారి వందన సమర్పణతో సభ ముగిసింది. గ్రామీణ శాస్త్రవేత్తలను టెక్నాలజీ విద్యార్థుల సమక్షంలో వేదికపై సత్కరించడం ఎంతో వినూత్నమైన దృశ్యం. పరిపక్వ సమాజంలో జ్ఞానమే ప్రధానం. వ్యక్తి పూర్వాపరాలు ముఖ్యం కావు అని నిరూపించబడ్డాయి.

సభ అనంతరం ఆహూతులు, ఇన్నోవేటర్ల స్టాళ్ళను సందర్శించారు. చంద్రశేఖర్ గారి దోమలను నివారించే మూలికా ఔషధం, వెంకట క్రిష్ణుడు గారి సంజీవని (థండర్) సేంద్రియ కీటక నాశని, బ్రహ్మం రూపొందించిన 'గ్యాస్‌తో నడిచే ఇస్త్రీ పెట్టె', నర్సింహాచారి 'కాలిపోయిన ట్యూబ్ లైట్లను వెలిగించే సాధనం', సాగర్ తయారు చేసిన 'నలుగురు ఆడగలిగే చెస్ బోర్డు', ప్రకాష్ గారి 'మినీ కూలర్', మూలికా వైద్యుడు మోహన్ 'మూలికా ఔషధాలు', భానుమూర్తి ఆచారి రూపొందించిన 'ఆటోమేటిక్ డిజాస్టర్ వార్నింగ్ సిస్టమ్, నరేష్ తయారీ బట్టతలపై వెంట్రుకలు మొలిపించటానికి చేసిన హెయిర్ ఆయిల్ మరియు కందుకూరుకు చెందిన పి. నర్సింహారెడ్డి మరియు టి. శ్రీనివాసులు గారి వినూత్న లోహాలు మొదలైన ఆవిష్కరణలను ఆహూతులు ఎంతో ఆసక్తితో తిలకించారు. ఉన్నత విద్యావంతులైన ఇంజనీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణల సరసన గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్ల ఆవిష్కరణలు ప్రదర్శనకు నోచుకోవడం ఎంతో ముదావహం.

కళాశాల విద్యార్థులతో పాటు పరిసర పాఠశాలల విద్యార్థులు కూడా ప్రదర్శనను తిలకించటం జరిగింది. ఈ ప్రదర్శనలో ఎన్ఐఎఫ్, హనీబీఎపి స్టాల్ ద్వారా సందర్శకులకు యన్.ఐ.ఎఫ్., హనీబీనెట్‌వర్క్ గురించి మరియు జూన్-2008లో విశాఖ జిల్లా అరకులోయలో చేపట్టిన 21వ శోధయాత్ర గురించి అవగాహన కల్పించటం జరిగింది. మరియు 'పల్లెసృజన' పత్రికను పరిచయం చేయుటం జరిగింది. ఈ రెండురోజుల ప్రదర్శనను నిర్వహించిన 'ఆదిశంకర కళాశాల' యాజమాన్యం వారు కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించి దిగ్విజయం చేసిన ప్రొ. యన్.వి. సురేంద్రబాబు గారు, తమ అమూల్యమైన సమయాన్ని కేటాయించి విచ్చేసిన అతిథులు శ్రీ పి. గణేశం గారు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గారు, శ్రీ జె. దుర్గాప్రసాద్ గార్లకు ఇన్నోవేటర్లు ఋణపడి వుంటారనడంలో సందేహం లేదు.

# స్పందన

శ్రీమతి పి. అరుణా గణేశం గారికి, నమస్కారములు,

'పల్లెసృజన' పత్రిక ఆలోచనే వినూత్నంగా వుంది. గ్రామీణులను గ్రామాలను మరచిపోతున్న రోజుల్లో వారి పరిశోధనలకు మీరు ఒక వేదిక కల్పించడం అభినందనీయం. ఈ సందర్భంగా ఒక సమస్య మీ దృష్టికి, తద్వారా పాఠకుల దృష్టికి తెస్తున్నాను.

గ్రామాల్లో లక్షలాదిమంది గీత కార్మికులు మోకు ముస్తాదులాంటి పాత పరికరాలతో చెట్టెక్కి కల్లు గీస్తున్నారు. ప్రమాద వశాత్తు చెట్టుమీదనుండి కింద పడి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. చెట్టెక్కడానికి యంత్ర సహాయం కల్పిస్తే వారికి సౌకర్యంగా వుంటుంది. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడవచ్చు. గతంలో ఒకరిద్దరు ఈ ప్రయోగాలు చేసినట్లు పత్రికల్లో చదివాము. కాని అవి ఒక రూపాన్ని సంతరించుకొని ఉపయోగం లోకి రాలేదు. ఖాదీ గ్రామ పరిశ్రమవారు గీత కార్మికుల వృత్తి పరికరాల ఆధునీకరణ ఆలోచన చేశారు - మీరూ ఆలోచించండి. – వేముల ప్రభాకర్, హైదరాబాద్.

**ప్రభాకర్ గారూ,**

**మీ విలువైన సూచనకు ధన్యవాదాలు. కేరళకు చెందిన ఒక గ్రామీణ శాస్త్రవేత్త 'చెట్లెక్కే నిచ్చెన'ను తయారు చేశారు. ఇది ముఖ్యంగా కొబ్బరి చెట్లను ఎక్కడానికి సులువుగా వుంటుంది. ఇది చాలా చవకైనది, వాడటం చాలా సులభం కూడా త్వరలోనే మీకు ఈ పరికరానికి సంబంధించిన సిడిని పంపుతాం. హనీబీఏపి హైదరాబాదు కార్యాలయంలో ఒక నమూనా కూడా వుంది. మీరు దీన్ని గీత కార్మికులతో ప్రయోగాత్మకంగా ఉపయోగించి, మార్పులు చేర్పులూ సూచిస్తే సరియైన పరికరం తయారు చేసి ఇవ్వగలం. దయచేసి బ్రిగేడియర్ గణేశం గారిని సంప్రదించండి.** – ఎడిటర్.

**'యత్ర నార్యంతు పూజ్య తత్ర దేవతా:......'**

గౌరవనీయులు అసోసియేట్ ఎడిటర్ శ్రీమతి పి. అరుణా గణేశం గారికి, సాహితీ నమస్సులు. నేను 1971 నుండి రచనలు చేస్తున్నాను. అప్పటినుండి పలు పత్రిల్లో నా రచనలు వెలుగు చూస్తున్నవి. పలువురు సాహితీ వేత్తలు, పత్రికా సంపాదకుల నుండి ప్రశంసా లేఖలు వస్తున్నాయి. మీ పత్రిక 'పల్లెసృజన' ఈరోజే చూడటం తటస్థించింది. 'నా మినీ కవితలు (6)' 'వర్తమాన పదాలు' గా మీ పత్రికా ఎడిటర్ గారైన కె.యల్. రావు గారి పేర పంపుచున్నాను. ఇందులో పరిశీలించి, సవరించి (తప్పులుంటే) ప్రచురించి ప్రోత్సహించ వలసిందిగా కోరుచున్నాను. **– ముగడ కళాప్రియ (లక్ష్మీకృష్ణ), కొవ్వూరు.**

**కళాప్రియ గారికి,**

**మీరు పంపిన కవితలు చూశాము.మాకు పంపినందుకు కృతజ్ఞులం. 'పల్లెసృజన' ప్రాథమికంగా కథలను, కవితలను ముద్రించే సాహితీ పత్రిక కాదు. ఈ పత్రిక కేవలం పల్లెజ్ఞానకర్తలను (గ్రామీణ ఇన్నోవేటర్లు) ప్రపంచానికి పరిచయం చేయటానికి, దాగివున్న సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు వచ్చి పదిమందికి పంచదానికి తోడ్పడుతుంది.. మీకు తెలిసిన పల్లెజ్ఞానకర్తల గురించి వారు కనుగొన్న వాటిని గురించి వ్రాయండి ప్రచురిస్తాం. మీ కవితలను ముద్రించలేక పోతున్నందుకు క్షంతవ్యులం. త్వరలోనే మీ కవితలు మీకు చేరుతాయి.** – ఎడిటర్.

ఎడిటర్ గారికి,

నాపేరు పూసర్ల జనార్ధన రావు, నాకు కొన్ని కొత్త ఆలోచనలు వచ్చాయి. వాటిని మీకు పంపుతున్నాను. వాటిని హనీబీ పత్రికలో ప్రచురించవలసిందిగా కోరుకుంటున్నాను. అలాగే వాటిని అభివృద్ధి చేయుటకు సంబంధించిన వ్యక్తులను నాతో అనుసంధానం కుదుర్చవలసిందిగా కోరుకుంటున్నాను. నేను పంపిన 12 ఆలోచనలకు పేటెంట్ పొందు విధానం, వీటిని రిజిష్టర్ చేయించు విధానం నాకు సహాయ, సూచనలను అందజేస్తూ వీటి అభివృద్ధికి కృషి చేయటానికి సహాయ పడవలసిందిగా కోరుచున్నాను.

– పూసర్ల, జనార్ధన రావు, అరసాడ గ్రామం.

**మీ ఆలోచన వచ్చే సంచికలో ముద్రిస్తాము. మీ ఇన్నోవేషన్లకు హనీబీ సహకారం ఎల్లప్పుడూ వుంటుంది.** – ఎడిటర్.

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనీటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

### చందా వివరాలు

| | | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|---|
| సంవత్సరానికి | : | 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం) | : | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు (రెండు పాత సంచికలు ఉచితం) | : | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | : | 400/- | 4,000/- |

మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా

శ్రీమతి అరుణ గణేశం,
అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

## వంటగ్యాస్‌తో ప్రమాదాల నివారణకు

# షేక్ ఇష్వాఖ్ టెక్నిక్

షేక్ ఇష్వాఖ్ అనే గద్వాల యువకుడు గ్యాస్‌స్టౌలు పేలకుండా ఓ పరికరాన్ని కనిపెట్టడం జరిగింది. ఈ పరికరం ద్వారా ఇక గ్యాస్‌స్టౌలు పేలి మనుషులు చనిపోయే విధానానికి స్వస్తి చెప్పవచ్చు. ఇటీవల చాలామంది గృహిణులు గ్యాస్ లీకు వల్ల ప్రమాదాలకు లోనై ప్రాణాలు కోల్పోతారు. ఇంత టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో కూడా ఇలాంటి ప్రమాదాల వల్ల గృహిణులు మరణించడం ఇష్వాఖ్ ఒప్పుకోలేక పోయాడు. ఒక్కోసారి గ్యాస్ స్టౌ వెలిగించే విషయంలో చిన్న చిన్న తప్పులు జరగటం వల్ల దానికి ఒకటి లేదా కొన్ని ప్రాణాలను బలిపెట్టాల్సి రావడం చాలా బాధాకరం. ఇష్యాఖ్ ఈ సమస్యకు అతి సులువైన పరిష్కారాన్ని కనుగొన్నాడు. ఆ పరికరాన్ని గురించి ఇష్యాఖ్ మాటల్లో.....



"ఓరోజు వరంగల్ లోని ఓ ఇంట్లో గ్యాస్ స్టౌ పేలి ఒక తల్లి ఇద్దరు పిల్లలు గ్యాస్ లీకేజి వల్ల చనిపోయిన విషయం పేపర్లో చదివి చాలా కలత చెందడం జరిగింది. ఆరోజు తనను తాను ప్రశ్నించుకుని ఈ దుర్ఘటనలను ఎలాగైనా ఆపాలని నిశ్చయించుకున్నాడు. చాలా మదన పడ్డ తర్వాత అందుకు ఓ ఉపాయం తట్టింది. ఎలాగైనా ఈ దుర్ఘటనలను ఆపాలని నిశ్చయంతో పరికరాన్ని తయారు చేయటం మొదలు పెట్టాడు. ఎన్నో విధాలుగా జరిగిన సంఘటనలన్నీ పత్రికల ద్వారా తెలుసుకుని, వాటి నివారణకై మార్గాలు వెతికే సమయంలో నేను కనుగొన్న కొన్ని వియాలేమిటంటే, గ్యాస్ సిలిండర్ ఎప్పుడూ పేలదు. ఈ పేలటానికి కారణం గ్యాస్ లీకేజి మాత్రమే అని తెలుసుకున్నాను. గ్యాస్ లీక్ అయిన తర్వాత గాలి, వెలుతురు సరిగా లేని ఇంట్లో ఆ గ్యాస్ ఆ గదిలో అలాగే ఉండిపోవటం జరుగుతుంది.



గ్యాస్ సిలిండర్ వల్ల జరిగిన చాలా సంఘటనల్లో గ్యాస్ పేలి కొన్ని ప్రాణాలు పోయాయే కాని, గ్యాస్ సిలిండర్ పేలలేదు అన్నది నేను కనుగొన్న ముఖ్య విషయం. చాలామంది వినియోగదారులు గ్యాస్ వాడకం ముగిసిన తర్వాత సిలిండర్‌ను కట్టివేయడం మరిచిపోవటమో, ఆ... ఏమౌతుందిలే అని అశ్రద్ధ చేయటమో జరుగుతోంది. ఇలా మరచిపోవటం వల్ల స్టౌకు గ్యాస్ సరఫరా చేసే రబ్బరు ట్యూబు దెబ్బతినటం ద్వారా గ్యాస్ లీక్ కావటం కూడా చాలాచోట్ల జరుగుతుంది. ఒకసారి హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం సెలవులకు వేరే ఊరు వెళ్ళటం మూలంగా గ్యాస్ లీకయి ఇంట్లో ఫ్రిజ్ ఆన్‌లోనే వుండటం వల్ల ఆందులో వచ్చిన స్పార్క్ వల్ల సిలిండర్ పేలి ఇంట్లోని విలువైన వస్తువులన్నీ బుగ్గిపాలయ్యాయి. వీరంతా సెలవులపై ఊరు వెళ్ళటం మూలంగా వారి జీవితాలు క్షేమంగా వున్నాయి. ఇలాంటి సంఘటనలను మనం వార్తల్లో, టీవీల్లో చూస్తే ఎటువంటి వ్యక్తికైనా కొంత మనస్థాపం కలగక మానదు.



ఎట్టకేలకు ఈ అపాయాన్ని నివారించేందుకు ఓ పరికరం తయారు చేయటం జరిగింది. ఈ పరికరాన్ని సిలిండర్‌కు, స్టౌకు అనుసంధానం చేస్తూ బిగిస్తే స్టౌపై ఎంతమేర గ్యాస్‌ను వాడుకుంటున్నామో అంతే గ్యాస్ సిలిండర్ నుండి విడుదల అవుతుంది. స్టౌ కట్టివేసిన వెంటనే ఆటోమేటిక్‌గా సిలిండర్ నుండి గ్యాస్ రావటం ఆగిపోతుంది. ఈవిధంగా ఎన్నో జీవితాలను రక్షించగలిగిన వాడిని అవుతాననే ఆనందంతో ఈ పరికరాన్ని తయారు చేశాను. ఇప్పుడైనా ఈ పరికరాన్ని ప్రజలు అందుబాటులోకి తెచ్చి గ్యాస్ లీక్ వల్ల ప్రాణ నష్టాలను పూర్తిగా ఆపాలని ఆశిస్తున్నాను".

ఈ పరికరం విలువ కేవలం రూ. 300/–లు మాత్రమే. కాని ఇక గ్యాస్ లీక్‌కాదనే నిశ్చింతతో ఉండవచ్చు. ఇష్వాక్ కనిపెట్టిన ఈ పరికరాన్ని పెద్దయెత్తున ఉత్పత్తి చేసి దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయటం కోసం హనీబీఎపి పూనుకుంది. వీటి తయారీకై ఉత్పత్తిదారులను సంప్రదిస్తోంది. అతి త్వరలో ఈ పరికరం మార్కెట్లో లభ్యం కావటానికి శాయశక్తులా కృషి చేస్తోంది. ఈ పరికరం పేటెంట్‌కై సంప్రదించటం కూడా జరిగింది.

ఇన్నోవేటర్ : **ఇష్వాక్, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లా. సెల్ : 98668 97198.**


## ముచ్చటగా మూడో వసంతంలోకి అడుగిడిన పల్లెసృజన

# పాత సంచికలు కావాలా?















**ఒక్కో సంచిక రూ. 15/-లు మాత్రమే**










**కావలసిన వారు డి.డి. లేదా మనియార్డరుతో ఎడిటర్‌ను సంప్రదించండి.**